

# వార్త

ఆదివారం

27 అక్టోబరు, 2024



# నువ్వా..నేనా!



## అమెరికాలో హోరాహోరీ

# అనిల్ కుమార్ దర్శకత్వంలో అఖిల్?



అక్కినేని యువ హీరో అఖిల్ 'ఏజెంట్' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. యూవీ క్రియేషన్స్‌లో అనిల్ కుమార్ అనే కొత్త దర్శకుడితో అఖిల్ ఓ సినిమా చేయడానికి అంగీకరించినట్లు తెలుస్తోంది. స్క్రిప్ట్ వర్క్ కూడా పూర్తయినట్లు సమాచారం. అయితే యూవీ క్రియేషన్స్ ఈ సినిమా విషయంలో ఎలాంటి క్లారిటీ ఇవ్వడం లేదు. ఇదిలా ఉంటే అఖిల్ తన హోమ్ ప్రొడక్షన్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఒక సినిమా చేయడానికి రెడీ అవుతున్నట్లు వినిపిస్తోంది. 'వినరో భాగ్యము విష్ణు కథ' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన మురళీకిషోర్‌తో ఈ సినిమా ఉంటుందని వినికిడి. అయితే ఈ సినిమాపై కూడా ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మరోవైపు అఖిల్ డిజిటల్ ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధంగా వున్నారని, ఓ వెబ్ సిరీస్‌కి అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ మూడు ప్రాజెక్టులలో ఏది ముందు ఉంటుంది? మూడు ప్రాజెక్ట్ ఉన్నాయా అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. నాగచైతన్య 'తండేల్' చిత్రంతో పాన్ ఇండియా లెవల్‌లో విజయం సాధించాలని చూస్తున్నారు. నాగార్జున సైతం 'కుబేర'తో పాటు 'కూలీ' సినిమాలలో నటిస్తున్నాడు. దాంతో అఖిల్ ప్లాన్ ఏంటని ఆసక్తికరంగా మారింది.

తారాతీరం

# 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' డిసెంబరులో విడుదల!

బుల్లితెర హీరో ప్రదీప్ తన రెండో ప్రయత్నంగా మరో చిత్రంలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. గత కొంత కాలంగా ఈ సినిమా కోసమే టీవీ షోలకు దూరంగా వుంటున్నట్లు సమాచారం. ఈ చిత్రం ద్వారా జబర్దస్త్‌తో పాటు పలు కామెడీ షోలకు దర్శకత్వం వహించిన నితిన్, భరత్‌లు దర్శకులుగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రానికి 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' అనే టైటిల్ నిర్ణయించారు.

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన మొదటి చిత్రం టైటిల్ కూడా ఇదే కావడం విశేషం. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను గత వారం విడుదల చేశారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో యూత్‌కు నచ్చే ఓ ప్రేమకథను జోడించినట్లు తెలుస్తోంది. డిసెంబరులో ఈ సినిమాని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి రథన్ సంగీతం సమకూరుస్తున్నారు.



ఆదివారం వార్త

27 అక్టోబరు, 2024

## మంచి ముత్యాలు

బాధ్యతలను గుర్తించి, వాటిని సంపూర్ణంగా నిర్వర్తించిన వారికే హక్కుల గురించి పోరాడే అధికారం ఉంటుంది.

– మహాత్మాగాంధీ

## విషయ విశేషం


సోషల్ మీడియాతో కొత్త భాషా..... 4

'సంఘీ'భావం....5

మూసీ ప్రక్షాళన సమర్ధనీయమే..కానీ

కవర్ స్టోరీ..6

నువ్వా..నేనా!
అమెరికాలో హోరాహోరీ

అరచేతిలో 'డిజిటల్ ట్విన్'...11

ఈవారం కవిత్వం..12

ఇల్లన్నాక..

సుందర హిల్‌స్టేషన్ మున్నార్...14

జంతువులను కాపాడుకుందాం...18

కథ.. 20

లేడీస్ గ్రేట్

సాహిత్యం.. 22

తెలుగు మణిహారం

ఏదీ శాశ్వతం కాదు... 25

వెలుగు రేఖల దీపావళి...27

విజయవంతమైన పనికోసం...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


# తాజా వార్తలు

## తక్కువ హోంవర్క్ ఉండాలి

ఎంత చేసినా తరగని హోంవర్క్.. దాంతో కుస్తీపట్టే పిల్లలని చూస్తే మనకే బాధగా అనిపిస్తుంటుంది. 'ఇంతింత హోంవర్క్‌లు వీళ్లకి అవసరమా?' అని. ఇదే ప్రశ్న ఐర్లాండ్‌లోని మేనూత్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలకీ వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా పిల్లలకు హోంవర్క్ ఇచ్చే విధానం ఎలా ఉంది..ఒక వారంలో పిల్లలకు ఎంత హోంవర్క్ ఇస్తున్నారు. అది వాళ్లకి ఉపయోగపడేలా ఉంటోందా భారంగా మారుతోందా అనే దిశగా దాదాపు ఐదువేలమంది స్కూలు విద్యార్థులపైన ఏఐ (కృత్రిమ మేధ) సాయంతో పరిశోధనలు చేశారు. ఇందులో వీళ్లెవరూ హోమ్‌వర్క్‌ని తప్పుపట్టలేదు. కానీ..గంటల తరబడి సాగుతూ పిల్లలపైన భారం మోపే అసైన్‌మెంట్లకన్నా, తక్కువ సమయంలో పూర్తయ్యే చిన్నచిన్న అసైన్‌మెంట్లు మంచివని చెబుతున్నారు. పిల్లల్లో ఇవి పాజిటివ్ ప్రభావం చూపిస్తున్నాయంటున్నారు. పావుగంటలో పూర్తయ్యే అసైన్‌మెంట్లు ఇవ్వడం వల్ల విద్యార్థులు సబ్జెక్ట్‌మీద ప్రేమ పెంచుకోవడం గమనించారట. పైగా మిగిలిన సమయంలో వాళ్లకిష్టమైన వ్యాపకాల్లో పాల్గొంటూ శారీరకంగానూ మానసికంగానూ దృఢంగా మారతారని ఈ పరిశోధనలో తేల్చారు.

### రోజుకో రంగు గుడ్డు

నాటు కోడి గుడ్లు తెల్లగానో, గోధుమ రంగులోనో ఉంటాయి. కౌజు పిట్టల గుడ్లు గోధుమ రంగుపైన నల్లమచ్చలతో కనిపిస్తుంటాయి. నీలం రంగులో ఊర పిచ్చుక గుడ్లు ఉంటాయి. అయితే ఈ గుడ్లు ఎప్పుడూ ఒకేలా ఉంటాయి. టినోమస్ అనే పక్షి గుడ్లను చూస్తే ఎవరికైనా ఆశ్చర్యమేస్తుంది. ఎందుకంటే ఈ పక్షి రోజుకో రంగులో గుడ్లు పెడుతుంది. దక్షిణ అమెరికా, అర్జెంటీనాలో ఎక్కువగా కనిపించే ఈ పక్షి గుడ్లు నీలం, గచ్చకాయి వర్ణం, ఆకుపచ్చ, బ్రౌన్, లేత గులాబీ రంగుల్లో ఉంటాయి. గ్లాసీగా మెరిసే ఈ గుడ్ల లోపల అన్నింటి మాదిరే పచ్చ సొన ఉంటుంది. పచ్చిక బయళ్లలో సంచరించే ఈ పక్షులు నేలమీదే గూడు అల్లుకుంటాయి. మగ పక్షి గుడ్లను పొదగడం వీటి ప్రత్యేకత. దక్షిణ అమెరికాలో ఈ పక్షుల మాంసానికి ఎంతో డిమాండ్. వీటిని పెంచుకోరుగానీ మాంసం కోసం వేటాడుతుంటారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

విస్తృత అంతర్జాల వాడకం, సామాజిక మాధ్యమాల్లో సదా నెటిజన్లు నివసించడం అలవాటు లేదా దురలవాటుగా మారిన ప్రత్యేక డిజిటల్ యుగం కొనసాగుతున్న అకాలమిది. సోషల్ మీడియా సాంకేతిక వేదికగా ఆసక్తికరమైన ఆంగ్ల పదాలు నిత్యం పుట్టుకొస్తున్నాయి, అయోమయంలో కూడా పడేస్తున్నాయి.



# సోషల్ మీడియాతో కొత్త భాషాపదాలు

డా॥బుర్రా మధుసూదన రెడ్డి

సెల్ఫీ (స్వయంగా తీసుకునే ఫొటోలు), ట్రోల్ (వ్యక్తులను కలవరపెట్టే ఆన్‌లైన్ సంఘర్షణలు), బ్లాగ్‌స్పియర్ (వ్యక్తిగత వెబ్‌సైట్‌ల సామూహిక పదం), బజ్‌వర్డ్ (నిర్దిష్ట సమయ సందర్భాల్లో వాడే పదబంధాలు) లాంటి పలు సంక్షిప్త పదాలు నిత్యం వాడుకలోకి వచ్చాయి. 'ప్లాట్‌ఫాం' అనగానే రైల్వేస్టేషన్ గుర్తువస్తుంది. నేడు అంతర్జాల వలలో 'ప్లాట్‌ఫామ్'లు వెలసి డిజిటల్ వేదికల వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. సాధారణంగా స్నేహితుల్ని ఫ్రెండ్ అంటాం. నేడు అంతర్జాల మాధ్యమాల్లో 'ఫ్రెండ్' అనే పదానికి అర్థమే మారిపోయింది. ఫేస్‌బుక్‌లో స్నేహితున్ని జోడించడాన్ని 'ఫ్రెండ్' అని, ఉన్న వారిని తొలగించడాన్ని 'అన్‌ఫ్రెండ్' అని పిలుస్తున్నాం. నిజానికి 'అన్‌ఫ్రెండ్' అనే పదమే ఆంగ్లభాషలో కనిపించదు. యూకెలో ఫేస్‌బుక్‌లో ఒక వ్యక్తి సగటున దాదాపు 300 మంది ఫ్రెండ్స్‌ను (స్నేహితులు) కలిగి ఉన్నారు. వీరిలో 10శాతం కూడా ప్రత్యక్ష మిత్రులు ఉండడం లేదు. ఫేస్‌బుక్ వేదికగా ఒక వార్తను లేదా వీడియోను లేదా ఫొటోను క్షణాల్లో స్నేహితులందరితో పంచుకోవచ్చు. 'లైక్'లు (మన పోస్టులకు ఎదుటివారు స్పందించడం), 'వైరల్' (క్షణాల్లో బహుళ ప్రచారం పొందడం),



షేర్ (సామాజిక మాధ్యమాల వేదికలో సమాచారాన్ని ఇతరులతో పంచుకోవడం) అనే పదాలు సామాన్యుని బుర్రలో తిష్టవేస్తున్నాయి. ఒక విషయాన్ని శోధించడానికి 'సెర్చ్ ఇట్'కు బదులుగా 'గూగుల్ ఇట్' 'దీని కోసం శోధించు' అంటున్నాం. 'ట్విట్టర్' ని ఉపయోగించి సందేశాన్ని రాయడాన్ని 'ట్వీట్ ఇట్' అంటున్నాం. ఈ పదాలను గమనిస్తే సామాజిక మాధ్యమాలు మనం మాట్లాడే, రాసే ఇంగ్లీషును మార్చివేస్తున్నట్లు తెలుస్తున్నది.

సామాజిక మాధ్యమాల వేదికలో పుట్టిన ఆంగ్లపదాలు

సామాజిక మాధ్యమాల ప్లాట్‌ఫామ్‌లు విభిన్న ప్రపంచ భాషల, విభిన్న వినియోగదారులను కలుపుతున్నాయి. మనం వాడే రోజువారీ భాషలో విదేశీ పదాలు చేరుతున్నాయి. వివిధ భాషలు మిళితమవుతూ 'స్పాంగ్లిష్' (స్పానిష్, ఇంగ్లీష్ కలయిక), 'హింగ్లిష్' (హిందీ, ఇంగ్లిష్ కలయిక)లాంటి హైబ్రిడ్ భాషాపదాలు పుట్టకొచ్చాయి. 'టెక్టర్స్' లేదా టిఎక్స్‌టి (రాతసమాచారం), 'పోస్ట్' (సామాజిక మాధ్యమంలో పెట్టడం), 'ఎమోజీలు' (చిరునవ్వు, ముఖం చిట్లించడం లాంటి ముఖకవళికల ఫొటోలు, భావవ్యక్తీకరణ ఫొటోలు), 'హాష్‌ట్యాగ్' (ట్వీట్ల వర్గీకరణకు వినియోగించే పదాలు), 'నెటిజెన్స్' (అంతర్జాలం వాడే పౌరులు), టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి కొత్త పదాలు లేదా పదబంధాలు నేడు ఆంగ్లభాషలోకి చేరుతున్నాయి. భాషాపదాల ఆవిష్కరణలకు శక్తివంతమైన సాధనాలుగా సోషల్‌మీడియా వేదికలు నేడు దోహదపడుతున్నాయి.

ఆక్స్ ఫర్డ్ నిఘంటువులోకి చేరిన సోషల్‌మీడియా ఆంగ్లపదాలు

ఆక్స్ ఫర్డ్ డిక్షనరీలోకి సహితం కొన్ని సోషల్ మీడియాలో అత్యంత నెటిజెన్ల ఆదరణ పొందిన పదాలు చేరిపోయాయి. వైఓఎల్ఓ, (యూఓన్లీ లివ్ వన్స్–మీరు ఒక్కసారి మాత్రమే జీవిస్తారు), ఎల్ఓఎల్ (లాఫింగ్ అవుట్ లౌడ్లీ–బిగ్గరగా నవ్వడం), డిఎం (డైరెక్ట్ మెసేజ్–నేరుగా సమాచారం పంపడం),

**(మిగతా 19వ పేజీలో)**

'సంఘీ' భావం



# మూసీ ప్రక్షాళన సమర్థనీయమే..కానీ

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మీదుగా ప్రవహిస్తున్న మూసీ నది ఒకప్పుడు నగరవాసులకు కల్పతరువుగా ఉండేది. గలగల పారే నదీ ప్రవాహం ప్రజల దాహార్తిని తీర్చేది. అయితే క్రమంగా రాజకీయాల జోక్యంతో మూసీ తన నిజస్వరూపాన్ని కోల్పోతూ వచ్చి చివరికి మూసీ ఒక మురికికూపంగా నిలిచింది. అన్ని రాజకీయ పార్టీలు తరతమ బేధం లేకుండా మూసీ మసక బారేలా చేశారు. ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురిచేసి కట్టడాలు నిర్మించారు. నగర పరిసరాల్లోని పరిశ్రమలు తమ వ్యర్థాలను, విషతుల్యమైన రసాయనాలు మూసీలో కలుపుతూ వచ్చారు. కాలక్రమేణ మూసీ నది అన్నది ఇక్కడ ఉండేదా అన్న అనుమానాలు కలిగే పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి సుమారు రెండు దశాబ్దాల నుంచే మూసీ ప్రక్షాళన చేయాలన్న ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అయితే కేవలం ఆర్భాటాలకు, ప్రకటనలకు మాత్రమే పరిమితం అయ్యాయి. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సిఎం హోదాలో మూసీ ప్రక్షాళనను భుజంపై ఎత్తుకున్నారు. మూసీ ప్రక్షాళనకు ఏ రాజకీయ పార్టీ గాని, స్థానిక ప్రజలు కాని వ్యతిరేకం కాదు. అయితే ప్రస్తుతం ఈ ప్రక్షాళన అంశం సున్నితంగా మారింది. సుమారు మూడు దశాబ్దాలుగా మూసీ గర్భంలో ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న ప్రజలను ఒక్కసారిగా అక్కడి నుంచి తొలగించడం కొంత కష్టతరమైన వ్యవహారంగా ఉంది. ముఖ్యంగా రాజకీయాలు జోక్యం చేసుకోవడంతో మూసీ ప్రక్షాళన ప్రశ్నార్థకంగా మారుతోంది. తాము మూసీని ఏ విధంగా అభివృద్ధి చేస్తున్నామన్న అంశంపై ప్రభుత్వానికి స్పష్టత కరువైంది. ఒకవేళ స్పష్టత ఉన్నా దానిని ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో విఫలం చెందుతున్నారు. దీనితో మూసీ గర్భంలో నివాసం ఉంటున్న నిరుపేదలపై ప్రభుత్వం కక్షకట్టిందని ప్రతిపక్షాలు బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. దీనితో ప్రస్తుతం మూసీ నదిలో ఉన్న మురికి అధికారపార్టీకి అంటుకుంటోంది. అధికారిక లెక్కల ప్రకారం సుమారు 10 వేలఆరు వందల కట్టడాలు ఉన్నట్లు ప్రకటించారు. ఇందులో సుమారు 1690 మందికి ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యామ్నాయాలు చూపించి వారిని ఖాళీ చేయించింది. మూసీ నదీగర్భంలో నివసిస్తున్న వారిని తొలగిస్తే చూస్తూ ఊరుకోమని ప్రతిపక్షాలు హెచ్చరికలు చేయడంతో ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు ప్రభుత్వ ప్రత్యామ్నాయాలు అవసరం లేదని వాదిస్తున్నారు. దీనితో వీరిని తొలగించడం అసాధ్యంగా మారింది. మూడు దశాబ్దాల నుంచి ఇక్కడే ఉంటున్నామని, తమ ప్రాంతం ఇప్పటి వరకు ముంపు సమస్యను ఎదుర్కొలేదని స్థానికులు వాదిస్తున్నారు. మూసీ నదిలో సుమారు 11 వేల కట్టడాలు నిర్మించి నదీపరివాహక ప్రాంతాన్ని కుదించిన తరువాత నీరు ప్రవహించే దారిలేక కుదించుకుపోయింది. అందువల్లే వీరి నివాసాల్లో నీరు రాలేదు. ఒకసారి అక్రమ కట్టడాలు తొలగిస్తే ప్రస్తుతం నివాసం ఉంటున్న వారి ప్రాంతాలన్నీ నీటి ప్రవాహంతో నిండిపోయే అవకాశం ఉంది. మూసీ నది వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండల్లో పుట్టి సుమారు 267 కిలోమీటర్లు ప్రయాణించి నల్గొండ వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. వికారాబాద్‌లో మూసా లేదా ముచ్చుకుందా నదిగా పిలుస్తారు. అక్కడి నుంచి నగరంలోని లంగర్‌హౌస్ వద్ద బాపూఘాట్ వద్ద సంగమంగా మారుతుంది. ఇక్కడ మూసా నదికి, ఈసీ నది కలుస్తుంది. అందుకే బాపూఘాట్ సంగమం అని పిలుస్తారు. ఈసీ, మూసా నదులు కలిసి మూసీ నదిగా పేరు మార్చుకుంది. ఈ నదికి 1908లో భారీ వరదలు రావడంతో సుమారు 15 వేల మంది పౌరులు మృతి చెందారు. ఉస్మానియా ఆసుపత్రి వద్ద ఉన్న చింతచెట్టు ఎక్కి సుమారు 150 మంది ప్రాణాలు దక్కించుకున్నారు. ఆరో నిజాం మీర్ మహబూబ్ ఆలీఖాన్ మూసీ వరద తరువాత సమీక్షలు నిర్వహించి భవిష్యత్తులో ఇలాంటి ముప్పు రాకుండా నివారించేందుకు ప్రయత్నించారు. ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను పిలిపించి ప్రణాళికను సిద్ధం చేశారు. మూసీ నదికి వచ్చే వరద నీటిని అదుపు చేసి నిల్వ చేసుకోవడమే కాకుండా ఈ నీటిని తాగునీటి అవసరాలకు ఉపయోగించాలని విశ్వేశ్వరయ్య ఇచ్చిన సూచన మేరకు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నిర్మించారు. ఇప్పటికీ ఈ జంట జలాశయాలు హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలు తీర్చుతున్నాయి. ఈ నిర్మాణాల తరువాత 1930, 1954, 1970, 2000 సంవత్సరాల్లో వరదలు వచ్చినా ఈ జంట జలాశయాలు నిర్మాణం కారణంగా హైదరాబాద్ నగరానికి ఎలాంటి ముప్పు కలగలేదు. వాస్తవానికి నిజాం హయాంలోనే మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఆ తరువాత 1997లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నందనవనం ప్రాజెక్ట్ పేరుతో మరోసారి ప్రక్షాళన చేపట్టింది. నదీ గర్భంలో పదిమీటర్ల కాంక్రీట్ కాలువ నిర్మించి నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. సుమారు వెయ్యి కుటుంబాలను నదీగర్భం నుంచి ఖాళీ చేయించి వారికి ప్రత్యామ్నాయం కల్పించారు. 2017లో టిఆర్ఎస్ (బిఆర్ఎస్) ప్రభుత్వం జీవో నెం 90 నుంచి తీసుకుచ్చి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. 2031 నాటికి ఉండే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించారు. ప్రస్తుతం మళ్లీ మూసీ ప్రక్షాళన అంశం తెరపైకి వచ్చింది. అత్యంత సున్నితంగా మారిన ఈ అంశంలో రాజకీయాల జోక్యం లేకుండా అఖిలపక్షం ఆధ్వర్యంలో పనులు చేపట్టి మూసీకి పూర్వ వైభవం తీసుకువస్తే హైదరాబాద్‌తో పాటు నల్గొండ జిల్లాకు కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ





# నువ్వా..నేనా!

## అమెరికాలో హోరాహోరీ

కవర్‌స్టోరీ

ఎ.వి.వి.ప్రసాద్
అసోసియేట్ ఎడిటర్, వార్త

### నవంబర్ 5 వైపే..

ఇప్పుడు ప్రపంచంలోని అందరి దృష్టి. ఆ రోజున అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నాయి. అగ్రరాజ్యంగా పేరుపొందిన అమెరికాలో జరిగే ఎన్నికలకు ఇతర అన్ని దేశాలకంటె ఎక్కువ ప్రాధాన్యం లభిస్తూంటుంది. దానికి ప్రధాన కారణం ప్రపంచంలోని మూడు వంతుల దేశాలు ఏదో ఒక రూపంలో అమెరికాపై ఆధారపడడం లేదా అమెరికా సాయం పొందడమే. అమెరికా ఆర్థిక, రాజకీయ ప్రభావం ఎంతో కొంత పడని దేశాలు చాలా తక్కువ. అందుకే అమెరికా రాజకీయాలను, తద్వారా ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేసే అధ్యక్ష ఎన్నికలపై అందరిలోను అంతటి ఉత్కంఠ. అన్ని ప్రజాస్వామ్య దేశాలలో జరిగినట్లే రాజకీయ పార్టీలు ఎన్నికల్లో హోరాహోరీ పోరాడుతాయి. అయితే రెండు పార్టీల మధ్యనే ఈ పోరు కొనసాగడం చరిత్రలో మనకు కనిపిస్తుంది. డెమొక్రాట్లు, రిపబ్లికన్లు ప్రధాన ఆటగాళ్లుగా అమెరికా రాజకీయ క్రీడ సాగుతుంది. 1792 నుంచి రాజకీయాలను ప్రభావితం చేస్తున్న డెమొక్రాట్లు ఉదారవాద విధానాలకు అద్దంపడితే, ఆ తర్వాత 1854 నుంచి రిపబ్లికన్లు ప్రాచుర్యంలోకి వచ్చారు. మార్కెట్–ఆధారిత విధానాలు రిపబ్లికన్ల ప్రత్యేకత. వాటితో పాటు కొన్ని 'మూడవ' పార్టీలు కూడా ఉన్నా, అధికారం అందుకోగల స్థాయికి అవి ఎప్పుడూ రాకపోవడంతో బాహ్య ప్రపంచానికి అమెరికా అంటే రెండు పార్టీల వ్యవస్థగా కనిపిస్తూంటుంది. ఈ రెండు పార్టీల్లో డెమొక్రాట్ల నుంచి అధ్యక్ష అభ్యర్థిగా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ పోటీ పడుతుండగా, రిపబ్లికన్ల నుంచి మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బరిలో ఉన్నారు. ఎన్నికల ప్రచారం పతాకస్థాయికి చేరుకోవడం, ఎన్నికల తేదీ సమీపిస్తుండడంతో అధ్యక్ష పీఠం ఎవరు అధిరోహిస్తారనే ఉత్కంఠ అందరిలో మరింత పెరుగుతోంది.

బరాక్ ఒబామా, జాన్‌ఎఫ్ కెన్నెడీ, బిల్‌క్లింటన్, రూజ్‌వెల్ట్, జిమ్మీకార్టర్ వంటి యోధానుయోధులు డెమొక్రాట్లలో కనిపిస్తే; అబ్రహాంలింకన్, జార్జిబుష్, హెర్బర్ట్ హూవర్, నిక్సన్, రొనాల్డ్‌రీగన్, డొనాల్డ్‌ట్రంప్ వంటి అగ్రగణ్యులు రిపబ్లికన్లలో కనిపిస్తారు. 'మూడవ' పార్టీలలో లిబర్టరియన్, గ్రీన్, కాన్‌స్టిట్యూషన్ వంటివి ఉన్నాయిగాని ఓటర్లుగాని, రాజకీయ పరిశీలకులుగాని వాటి గురించి పట్టించుకోవడమే చాలా తక్కువ. అవి సాధారణంగా రెండు ప్రధాన పార్టీలలో ఏదో ఒకదానికి మద్దతిస్తూంటాయి. కొందరు 'స్వతంత్రులు' కూడా పోటీ పడుతూంటారుగాని ఎన్నికల్లో వారి ప్రభావం కూడా చాలా తక్కువ. అందుకే అటు డెమొక్రాట్లు, ఇటు రిపబ్లికన్లు.. రాజకీయ యవనికపై ఆ రెండు పార్టీల అభ్యర్థులే ప్రత్యక్షమవుతూంటారు.

### భారతీయ ఓటర్ల ప్రభావం

అమెరికా అంటేనే అది భిన్న జాతుల సమాహారం. ప్రపంచంలోని అనేక దేశాల నుంచి వలస వచ్చిన వారు అమెరికాలో చాలా ఎక్కువ. దేశంలో మొత్తం ఓటర్లు 24 కోట్లుపైగా ఉండగా, దానిలో భారతీయ అమెరికన్లు దాదాపు

26 లక్షల దాకా ఉంటారు. వారిలో తెలుగువారు దాదాపు 11 లక్షల దాకా ఉన్నట్లు అంచనా. గత కొన్ని సంవత్సరాలుగా వీరందరు అమెరికా రాజకీయాల్లో ఒక బలమైన శక్తిగా ఎదగడం చూస్తున్నాం. అటు డెమొక్రాట్లు, ఇటు రిపబ్లికన్లు కూడా తమ విజయావకాశాలను భారతీయ ఓటర్లపైనే ఎక్కువ ఆధారపడడం కూడా గమనించవలసిన అంశం. ముఖ్యంగా భారతీయ మూలాలున్న ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ ఈసారి అధ్యక్ష పదవి పోటీపడుతుండడంతో భారతీయ అమెరికన్ల ఉత్సాహానికి పట్టపగ్గాలేకుండా ఉంది. ఓటర్లుగానే గాక అభ్యర్థులుగా, ఓటర్లను సమీకరించే శక్తిగా, నిధుల సేకర్తలుగా భారతీయుల హవా అమెరికాలో చాలా రకాలుగా విసరిస్తోంది. ఆ కారణంగా అధికార సాధనలో వారి మద్దతు నానాటికి కీలకంగా మారుతోంది.

ముఖ్యంగా అధ్యక్ష విజేతలను నిర్ణయించే రాష్ట్రాలుగా బలపడిన మిషిగన్, జార్జియా వంటి చోట్ల భారతీయులే ఎక్కువ. దానితో వారి మద్దతు, ఓట్లు రెండు పార్టీలకు చాలా కీలకంగా మారాయి. 2020లో బైడెన్ విజయం సాధించప్పుడు జార్జియా ఫలితమే నిర్ణాయకంగా మారడం తెలిసినదే. గత రెండు, మూడు అధ్యక్ష ఎన్నికలు అత్యంత హోరాహోరీగా సాగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో హారిస్, ట్రంప్ భాగ్యరేఖలు కూడా ఆ రాష్ట్రాలలోని భారతీయ ఓటర్లపైనే ఆధారపడ్డాయనిపిస్తుంది.

అమెరికా అధ్యక్ష పీఠానికి దారి సిలికాన్ వ్యాలీగుండా వెళ్తుందని నానుడి. కీలకమైన ఆ టెక్ రాజధానిలోను భారతీయులదే హవా. హారిస్‌కు కాలిఫోర్నియాలో ఇటీవల ఒక్కవారంలోనే 5.5 కోట్ల డాలర్ల విరాళాలు పోగయ్యాయట. దానిలో 95 శాతం విరాళాలు భారతీయులవే కావడం విశేషం. డెమొక్రటిక్ పార్టీకి భారీగా విరాళాలిస్తున్న వారిలో 60 శాతం మంది భారతీయులే కావడం మరో విశేషం. అయితే రిపబ్లికన్లకూ భారతీయుల నుంచి గణనీయంగానే విరాళాలు లభిస్తున్నట్లు సమాచారం. హోటల్ పరిశ్రమకు చెందిన భారతీయులు ఎక్కువగా రిపబ్లికన్ పార్టీకి, 'ఫండింగ్' చేస్తున్నట్లు తెలుస్తోంది. సెనెట్, ప్రతినిధుల సభతో పాటు రాష్ట్రాల సిటీ కౌన్సిళ్లలో కూడా భారతీయులు అధిక సంఖ్యలో ఉన్నారు. కొన్ని పర్యాయాలుగా డెమొక్రాట్లే అధికారంలో కొనసాగుతూండడంతో ఆ పార్టీకి మద్దతునిచ్చే భారతీయుల సంఖ్య కూడా పెరిగింది. బైడెన్-హారిస్ పాలనా యంత్రాంగంలో 15 మంది పైగా భారతీయ అమెరికన్లు కీలక స్థానాల్లో ఉన్నారంటే, అమెరికాలోను, డెమొక్రాట్లలోనూ భారతీయుల ప్రభావం ఎంతగా పెరుగుతున్నదో స్పష్టమవుతుంది. డల్లాస్, మరికొన్ని చోట్ల ఎన్నికల ప్రచారంలో తెలుగులో బ్యానర్లు, పోస్టర్లు కనిపించడం మరో ఆసక్తి కరమైన అంశం. తెలుగు తర్వాత తమిళం బ్యానర్లు కూడా ఎక్కువగానే కనిపిస్తున్నాయి. భారతీయ మూలాలున్న హారిస్ డెమొక్రాట్లు అధ్యక్ష అభ్యర్థిగా ఉంటే, రిపబ్లికన్లు తరఫున ఉపాధ్యక్షుడుగా ట్రంప్ బలపర్చిన వాన్స్-భారత సంతతికి చెందిన తెలుగమ్మాయి ఉషా చిలుకూరి భర్త కావడం చెప్పుకోదగిన మరో విశేషం. అటు హారిస్, ఇటు వాన్స్ మధ్య తెలుగు ఓట్లు, భారతీయుల ఓట్లు చీలిపోతున్నట్లు కనిపిస్తోంది.



ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్

## ఎవరికి ఎంత మద్దతు?

కమలాహారిస్, ట్రంప్‌లు ఉధృతంగా సాగిస్తున్న ప్రచారం, దేశంలోని వివిధ జాతుల వారి నుంచి లభిస్తున్న మద్దతును బట్టి చూస్తే ఒకసారి హారిస్ ముందంజలో ఉంటే, మరోసారి ట్రంప్ కనిపిస్తున్నారు. అయితే ఇద్దరి మధ్య తేడా రెండు శాతం లోపునే ఉన్నట్లు పరిశీలకులు చెబుతున్నారు. అంటే ఎన్నికల రోజు వరకు అంకెలు ఎలా కనిపించినా, చివరి క్షణంలో మారిపోవచ్చనే సంకేతాలు కూడా వినిపిస్తున్నాయి. జూన్, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వారిద్దరి మధ్య 'మద్దతు రేటింగ్' రోజుకో రకంగా మారుతూ రావడం గమనించవచ్చు. జూన్‌లో అధ్యక్షుడు బైడెన్, ప్రత్యర్థి ట్రంప్



కుటుంబ సభ్యులతో ట్రంప్

మధ్య తొలి డిబేట్ జరిగినప్పుడు ఆధిక్యత ట్రంప్‌వైపు కనిపించింది. రెండు పార్టీల అధ్యక్ష అభ్యర్థుల మధ్య ప్రధానంగా మూడు డిబేట్లు జాతీయ స్థాయిలో జరుగుతాయి. అలా జూన్‌లో బైడెన్, ట్రంప్ మధ్య జరగగా తన వాదనను స్పష్టంగా, గంభీరంగా వినిపించడంలో ట్రంప్ ముందు వరుసలో నిలిచారు. బైడెన్ తరచుగా తడబడడం, విధానాల వెల్లడిలో స్పష్టత లోపించడం, మరుపు వంటి కారణాలతో బైడెన్ ప్రజలను ఆకట్టుకోలేకపోయారు. పార్టీ నాయకుల ఒత్తిడితో ఆ కారణంగానే బైడెన్ పోటీ నుంచి విరమించవలసి వచ్చింది. తర్వాత పార్టీ నిర్ణయం ప్రకారం బరిలోకి దిగిన హారిస్ చాలా డైనమిక్‌గా ముందుకు కదలడంతో వెనుకబడడం ట్రంప్ వంతయింది. వారిద్దరి మధ్య మొదటి డిబేట్ (వరుసలో రెండోది) సెప్టెంబర్‌లో జరిగిన తర్వాత హారిస్‌కు, జనాదరణ రేటింగ్ భారీగా పెరిగింది.



కుటుంబ సభ్యులతో కమలాహారిస్

వారిద్దరి మధ్య జరిగిన సంవాదంలో ఆర్థిక వ్యవస్థ, గర్భవిచ్ఛిత్తి, వలసల విధానం వంటి పలు కీలక అంశాలపై దాదాపు 90 నిమిషాల పాటు చర్చ జరుగగా, ఈసారి తడబడడం ట్రంప్ వంతయింది. కొన్ని సమయాల్లో ట్రంప్ వాదనను హారిస్ నియంత్రించారు. ఆయన ఆర్థిక విధానాలలోని లోపాలను ఎత్తిచూపారు. అలాగే 2020 ఎన్నికల్లో పరాజయాన్ని ట్రంప్ అంగీకరించకపోవడం, సభలలో ఆయన వ్యవహార శైలిపై హారిస్ చురకలంటించారు. ట్రంప్ తరచుగా చిరాకుపడడం మీడియాలో హైలైట్ అయింది. ఆమె చేసిన ఆరోపణలను ట్రంప్ సరైన జవాబు ఇవ్వలేకపోయారు. హారిస్‌లో కనిపించిన దూరదృష్టి, దృఢవిశ్వాసం ట్రంప్‌లో లేవంటూ అమెరికన్ మీడియా వ్యాఖ్యానించింది. బైడెన్-ట్రంప్ సంవాదంలో ఆమె అధిక శాతం మార్కులు లభించాయి. ఆ తర్వాత అక్టోబర్ మొదటి వారంలో మళ్లీ ట్రంప్ రేటింగ్ కొద్దిగా పెరిగింది. హారిస్ ఆధిక్యత 4 నుంచి రెండు శాతం పడిపోయినట్లు సర్వే సంస్థలు అంచనా వేశాయి. గార్డియన్ పత్రిక అంచనా ప్రకారం, నువ్వా.. నేనా అనే రీతిలో పోరు కనిపిస్తున్న 19 కీలక రాష్ట్రాల్లో ట్రంప్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు ట్రంప్ ముందంజలోకి రావడానికి కారణంగా పరిశీలకులు భావిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో సంభవించిన రెండు భారీ హరికేన్లు, పశ్చిమాసియా సంక్షోభం ముదరడం హారిస్ ఆధిక్యం తగ్గడానికి ప్రధాన కారణాలుగా అమెరికన్ మీడియా పేర్కొంటోంది. అక్టోబర్ 15 నాటికి ఆమె ఆధిక్యం 46 శాతానికి తగ్గిపోయింది. అంటే ఇద్దరి మధ్య తేడా రెండు శాతం మాత్రమే ఉంది. పెన్సిల్వేనియా, మిచిగన్, విస్కాన్సిన్, నార్త్‌కరోలినా, జార్జియా, అరిజోనా, నెవాడా రాష్ట్రాల్లో హారిస్, ట్రంప్‌లు పోటా పోటీగా కనిపించడంతో తర్వాత మొగ్గు ఎటు మారుతుందోననే ఆందోళన రెండు పార్టీల్లోను కనిపిస్తోంది. వాటిలో మూడు రాష్ట్రాల్లో మాత్రమే హారిస్ పూర్తి ఆధిక్యతలో ఉండగా, మిగిలిన చోట్ల ట్రంప్ గట్టి పోటీ ఇస్తున్నారు. మూడు రాష్ట్రాలలో ట్రంప్ కంటే ఒక శాతమే హారిస్ ముందంజలో ఉన్నారు. రేటింగ్ ఇదే విధంగా కొనసాగితే నవంబర్ 5 పోలింగ్ రోజున విజయానికి కావల్సిన 270 ఎలక్టొరల్ కాలేజీ ఓట్లను ట్రంప్ సునాయాసంగా దక్కించుకోగలరని గార్డియన్





అమెరికా మాజీ అధ్యక్షులు

పత్రిక అంటోంది. అక్టోబర్ మొదటి వారం వరకు హారిస్ 55 శాతం రేటింగ్‌తో ముందంజలో ఉన్నా, తర్వాత పరిస్థితి కొంత మారిందనీ, ఇప్పుడు ఇద్దరూ 'నువ్వా..నేనా' రీతిలో హోరాహోరీగా పోరాడుతున్నారనీ, 'వాల్‌స్ట్రీట్ జర్నల్' పేర్కొంటోంది.

ఎన్నిక జరగడానికి ముందు నవంబరు మొదటి నాలుగు రోజులలోను పరిస్థితులు మారవచ్చన్నది 'న్యూయార్క్ టైమ్స్' అభిప్రాయం. ఇలా ప్రధాన మీడియా భిన్నాభిప్రాయాలు వ్యక్తం



అమెరికా మాజీ అధ్యక్షులు

చేస్తున్నా డెమొక్రాట్ల వైపే మొగ్గు కనిపించవచ్చనే అభిప్రాయం పరిశీలకుల వైపు నుంచి వినిపిస్తోంది. ఎలక్టొరల్ కాలేజి కీలకం నవంబరు 5న పోలింగ్ జరిగినా ఆ రోజునో, మర్నాడో ఫలితం తెలియదు. ఎవరి అంచనాలు వారు వేసుకోవచ్చు. కానీ అధ్యక్షుడెవరో తేలేది డిసెంబరు 17న మాత్రమే. దానికి కారణం అమెరికాలో అనుసరించే ఎలక్టొరల్ కాలేజీ విధానం. పోలింగ్ రోజున పడే ఓట్ల ఆధారంగా ఎలక్టొరల్ కాలేజి ప్రతినిధులు ఎన్నికవుతారు. వారిని ఎలక్టర్లు అంటారు. వారంతా డిసెంబరు 17న సమావేశమై అధ్యక్షుడిని ఎన్నుకొంటారు. మొత్తం 538 మంది ఎలక్టొర్లలో 270 మంది మద్దతు లభించినవారు అధ్యక్షులవుతారు. ఆయా రాష్ట్రాల్లోని జనాభా ఆధారంగా ఎలక్టొరల్ కాలేజి సీట్లు ఉంటాయి. ఉదాహరణకు కాలిఫోర్నియాకు అత్యధికంగా 54 సీట్లుండగా, టెక్సాస్‌కు 40 ఉన్నాయి. చాలా తక్కువ జనాభా ఉన్న వ్యోమింగ్‌కు మూడు సీట్లు మాత్రమే ఉన్నాయి. ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థికి ఆ రాష్ట్రంలోని ఎలక్టొరల్ కాలేజి సీట్లన్నీ వెళ్తాయి. ఉదాహరణకు ఈ ఎన్నికల్లో కాలిఫోర్నియాలో కమలాహారిస్‌కు సగం కంటె ఎక్కువగా 50.1 శాతం ఓట్లు వస్తే ఆ రాష్ట్రానికి చెందిన 54 సీట్లు గంపగుత్తగా డెమొక్రటిక్ పార్టీ ఖాతాలోకి వెళ్తాయి. మిగిలిన సీట్లకు కూడా ఇదే విధానం. అందుకే ఎక్కువ ఓట్లు రావడం కంటె, 270 ఎలక్టొరల్ కాలేజి సీట్లు వచ్చేలా ఓట్లు రావడం అమెరికా ఎన్నికల విధానంలో ప్రత్యేకం. ఎలక్టొరల్ కాలేజీ సభ్యులు పార్టీ విధానానికి వ్యతిరేకంగా వ్యవహరించి

ప్రత్యర్థికి ఓటు వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవచ్చుని అమెరికా సుప్రీంకోర్టు 2020లో తీర్పు చెప్పడం వల్ల ఈసారి అటువంటి 'అతిక్రమణలు' ఉండకపోవచ్చనే భావించాలి. ఇద్దరు అభ్యర్థులకూ సమానంగా అంటే 269 చొప్పున సీట్లు వస్తే అప్పుడు ఎలక్టొరల్ కాలేజి చేయవలసిన పనిని ప్రతినిధుల సభ, సెనెట్ చేస్తాయి. ఎలక్టొరల్ కాలేజి ద్వారా అభ్యర్థిని ఎంపిక చేయడం కుదరకపోతే అమెరికా రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడిని కాంగ్రెస్‌లోని దిగువ సభ(ప్రతినిధుల సభ), ఉపాధ్యక్షుడిని ఎగువ సభ(సెనెట్) ఎన్నుకుంటాయి. అయితే సాధారణంగా అటువంటి పరిస్థితి ఏర్పడదనే అంటారు.

## కీలక రాష్ట్రాలు ఎటు?

అమెరికాలో 50 రాష్ట్రాలు ఉన్నా, వాటిలో ఏడు రాష్ట్రాలను అత్యంత కీలకంగా భావిస్తారు. వాటినే 'స్వింగ్ రాష్ట్రాల'ని కూడా అంటారు. పెన్సిల్వేనియా, అరిజోనా, జార్జియా, మిషిగన్, నెవాడా, నార్త్ కరోలినా, విస్కాన్సిన్‌లో మొత్తం 93 ఎలక్టొరల్ కాలేజీ సీట్లు ఉన్నాయి. తాజా అంచనాల ప్రకారం పెన్సిల్వేనియాలో హారిస్‌కు స్పష్టమైన ఆధిక్యత కనిపిస్తోంది. గత ఎన్నికల్లో బైడెన్‌కు కూడా ఈ రాష్ట్రంలో 1.16 శాతం ఆధికత్యత లభించింది. విస్కాన్సిన్‌లో 2016లో ట్రంప్, 20లో బైడెన్ ఆధిక్యత సాధించారు. కానీ ఈసారి ఇక్కడ తనకే ఆధిక్యత రావచ్చనే ఆశాభావంతో ట్రంప్ కనిపిస్తున్నారు. ఈ రాష్ట్రంలో ముక్కోణపు పోటీ కనిపిస్తోంది. అరబ్-అమెరికన్ ఓటర్లు ఎక్కువగా ఉన్న మిషిగన్‌లో బైడెన్ గతంలో 2.78 శాతం ఆధిక్యత సాధించారు. ఈసారి ఆధిక్యత తగ్గినా డెమొక్రాట్లకే ఈ రాష్ట్రం లభించే సూచనలున్నాయి. నార్త్ కరోలినాలో ట్రంప్ ఆధిక్యం, జార్జియా, అరిజోనాలో బొటాబొటిగా హారిస్ ఆధిక్యతం కనిపిస్తున్నాయి. అయితే అరిజోనాలో రిపబ్లికన్లకు ఆధిక్యత లభించవచ్చుని కూడా పరిశీలకులు భావిస్తున్నారు.



బరాక్ ఒబామా



జార్జ్ బుష్



బిల్ క్లింటన్

## విధానాలపైనే చర్చ

గతంలో ఒబామా, బైడెన్ తేలికగానే విజయం సాధించినా, 'జాతీయత' ప్రకారం ఈసారి కమలాహారిస్ గట్టి పోటీని ఎదుర్కొనవలసి వస్తోంది. ట్రంప్‌పై గతంలో వచ్చిన ఆరోపణలు, కేసులు ఆయన విజయావకాశాలకు అడ్డు రాబోవనే రిపబ్లికన్లు భావిస్తున్నారు.

ప్రస్తుతం ఉపాధ్యక్షురాలిగా ఉన్నా, హారిస్ నల్ల జాతీయురాలు కావడంతో ఆమెకు ఆధిక్యత రేటింగ్ తగ్గుతున్నదనీ శ్వేత జాతీయుల ఓట్లు ట్రంప్‌కే పడతాయనీ భావిస్తున్నారు. డెమొక్రాట్ల ఓటుబ్యాంక్ పెద్దది కావడంతో ఈసారి కూడా ఆ పార్టీకే విజయావకాశాలుంటాయనే వాదం కూడా ఎక్కువగానే వినిపిస్తోంది.

అయితే ప్రపంచ యుద్ధానికి దారి తీసేలా కనిపిస్తున్న పశ్చిమాసియా యుద్ధం విషయంలో కొత్త అధ్యక్షుని వైఖరి ఎలా ఉండబోతోందన్నది కూడా పోలింగ్ రోజున ప్రభావం చూపవచ్చుంటున్నారు. తాను అధ్యక్షుడైతే ఉక్రెయిన్-రష్యా యుద్ధానికిగానీ, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికిగానీ ఒక్క రోజులో ముగింపు పలుకుతానని ట్రంప్ అంటున్నారు. అయితే అది అంత తేలిక కాదనే అభిప్రాయంతో హారిస్ కనిపిస్తున్నారు. సరిహద్దుల నుంచి లక్షలాది మంది చొరబడడానికి ఉపాధ్యక్షురాలిగా హారిస్ అనుసరిస్తున్న వలస విధానమే కారణమని ట్రంప్ చేస్తున్న ఆరోపణను ఆమె సమర్థంగా తిప్పికొట్టలేకపోతున్నారు. అయితే ట్రంప్ ఆరోపణలకు ఇప్పుడు తానేమీ చెప్పననీ, అధ్యక్షురాలు కాగానే చేసి చూపిస్తాననీ అంటున్నారు. తాను గెలిస్తే అబార్షన్లను నిషేధించే చట్టం చేస్తానని ట్రంప్ అంటుండగా, అబార్షన్లపై నిర్ణయాధికారం రాష్ట్రాలకే ఉండాలన్నది తన విధానమని హారిస్ అంటున్నారు. ట్రంప్ చాలా బలహీనుడు, వయోవృద్ధుడంటూ హారిస్ చేసే ప్రచారం ఓటర్లను ఎక్కువగా ఆకట్టుకుంటోంది. వాణిజ్యంలో మిత్రదేశాల మోసాన్ని అడ్డుకొనేందుకు దిగుమతి సుంకాలను పెంచుతానని ట్రంప్ అంటుంటే, మధ్య తరగతి ప్రజలకు పన్నుల నుంచి ఉపశమనం కలిగించే చర్యలు తీసుకొంటానని హారిస్ అంటున్నారు. ఇద్దరూ 'ఉచితా'లను కూడా విరివిగానే ప్రకటిస్తున్నారు. 2020 ఎన్నికల ఫలితాల తర్వాత క్యాపిటల్ హిల్‌పై జరిగిన దాడిని కూడా హారిస్ తన ప్రచారంలో ఎక్కువగా ఉపయోగిస్తూ- ఆ దాడికి బాధ్యుడు ట్రంపేనని అనడం కూడా ఓటర్లను ప్రభావితం చేస్తున్నట్లుగానే కనిపిస్తోంది. ట్రంప్, హారిస్ ఇద్దరూ ఒకరిని రెచ్చగొడుతూ మరొకరు ప్రచారం కొనసాగిస్తున్నారు.

## ఏం జరగబోతోంది!

అగ్రరాజ్యం అమెరికాకు జలుబు చేస్తే ప్రపంచం మొత్తం తుమ్ముతుందని వెనకటికి ఓ నానుడి ఉంది. పరిస్థితి ఇప్పటికి అదే అయినా, కొంత మార్పయితే వచ్చింది. అమెరికా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడంతో చాలా 'మిత్ర' దేశాలు కూడా చేతులు వదిలేస్తున్నాయి. ఇది డెమొక్రాట్లను, రిపబ్లికన్లను కూడా సమానంగానే బాధిస్తోంది. అందుకే పౌరసత్వం నిబంధనలను కూడా చాలా సరళం చేస్తున్నారు. ఈ విషయంలో ఉభయుల విధానం ఒక్కటే. కరోనా అనంతరం చాలా 'మిత్ర' దేశాలు ఆర్థిక స్వావలంబన వైపు దృష్టి సారించాయి. ఆ దేశాల ప్రజలు పెద్ద సంఖ్యలోనే అమెరికాలో ఉండడంతో ఆ ఓట్ల ప్రభావం కూడా ఈ ఎన్నికలపై ఎక్కువ పడవచ్చుని భావిస్తున్నారు. దాని ప్రకారం చూస్తే డెమొక్రాట్లకు మార్జిన్‌లోనైనా విజయావకాశాలు లభించగలవనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నవంబరు 5, డిసెంబరు 17 దగ్గరలోనే ఉన్నాయి కదా! ఏం జరుగుతుందో చూడాలి.



# రాళ్ల నుంచి రాకెట్ వరకు..

**అతని** పేరు ఆనంద్. ఊరు చెన్నైలోని కేళంబాక్కం. రాకెట్లను చేయడంలో దిట్ట. నిరుపేద స్థితి నుంచి ఉన్నతస్థాయికి చేరుకున్న ఆనంద్.. తన గురించి తన మాటల్లోనే.. చెన్నై దక్షిణ శివారున ఉన్న కేళంబాక్కం అనే ప్రాంతంలో క్వారీలు ఎక్కువ. మా నాన్న మేగలింగం వాటిల్లో రాళ్లు కొట్టేవాడు. ఇంట్లో నేనూ మా అక్కయ్య. అక్కయ్య పెద్దయ్యాక ఓ రెండు గదుల అద్దె ఇల్లు తీసుకున్నాడు నాన్న. అప్పటికి క్వారీ పనులు తగ్గిపోవడంతో నాన్న ట్రాక్టర్ డ్రైవర్‌గా మారాడు. ఈ కొత్త వృత్తి కొంతవరకూ మేం కుదుట పడేలా చేసింది. మిగతా పిల్లల్లా నేనూ అక్కయ్యా ఇంగ్లిష్ చదువుల కెళ్లాలన్న కలల్ని అమ్మానాన్నల్లో నింపింది. అలా కాయకష్టం చేస్తూనే మమ్మల్ని ప్రైవేటు స్కూల్లో చేర్పించారు. చిన్నప్పటి నుంచీ నేను యావరేజి విద్యార్థినే కానీ క్రీడల్లో ముందుండే వాణ్ణి. టెన్త్‌కి వచ్చేటప్పటికల్లా జిల్లా వాలీబాల్ జట్టులో స్థానం సంపాదించగలిగాను. స్పోర్ట్స్ కోటాతో ఇంటర్‌లో పెద్దగా ఫీజులు కట్టాల్సిన అవసరం లేకుండా గట్టెక్కేశాను. ఆ తర్వాత ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో 'ట్రిపుల్ ఈ' కోర్సులో చేరాను. అక్కడ స్పోర్ట్స్ కోటా పనిచేయకపోవడంతో అమ్మానాన్నలు పెద్ద మొత్తంలో అప్పులు చేయాల్సి వచ్చింది. రెండో ఏడాదికి వచ్చేనాటికి ఆ ఖర్చుని వాళ్లు తట్టుకోలేకపోయారు. దాంతో, నేను అర్థాంతరంగా కాలేజీ మానేయాల్సి వచ్చింది. నాటి నుంచీ నాన్నకి చేదోడు వాదోడుగా ఉండిపోయాను. అలా రెండేళ్లు గడిచాయి. అప్పుడే ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ యూనివర్సిటీ వాళ్లు స్పోర్ట్స్ కోటాతో విద్యార్థుల్ని చేర్చుకుంటున్నారని తెలిస్తే వెళ్లాను. ఆ ప్రాంగణం ముందు ఓ పెద్ద ఎయిర్‌క్రాఫ్ట్ నమూనా ఉంది. దాన్ని చూడగానే ప్రేమలో పడిపోయాను. అవకాశం వస్తే ఈసారి ఏరోనాటిక్స్ ఇంజినీరింగే తీసుకోవాలని అనుకున్నాను. నేను కోరుకున్నదే జరిగింది. స్పోర్ట్స్ కోటాలో నాకు అందులోనే సీటిచ్చారు. కానీ క్లాసులు మొదలయ్యాక ఎన్ని అవమానాలు ఎదురయ్యాయో..

క్లాసులోని విద్యార్థులకన్నా నేను మూడేళ్లు పెద్దవాణ్ణి కదా..! పైగా అప్పటికే 'బేసిక్స్' అన్నీ మరిచిపోయి ఉన్నాను. దాంతో ముందు మొద్దబ్బాయిగానే ముద్రవేశారు. నాతో ఎవరూ ఫ్రెండ్షిప్ చేసేవారు కాదు. ఓరకంగా ఆ ఒంటరితనం మంచే చేసింది. ఏ బాతాఖానీలకీ వెళ్లకుండా పుస్తకాలకే పరిమితమయ్యాను. ముఖ్యంగా, గాలిలో ఓ వస్తువు తేలిపోవడానికి ఏమేం చేయాలో నేర్పించే 'ఏరోడైనమిక్స్'పైన పట్టుసాధించాను. అప్పుడే ఓసారి ఇంటర్ కాలేజీ కాంపిటిషన్ జరిగింది. కాగితం రాకెట్లు చేసి ఎక్కువ సమయం గాలిలో నిలపే పోటీ అది. నేను ఓ కొత్త డిజైన్‌తో అలాంటి రాకెట్‌ను సృష్టించి..అందరికన్నా ఎక్కువ సమయం గాలిలో నిలపగలిగాను. ఫస్ట్ ప్రైజ్ నాకే వచ్చింది. రూ.500 ఇచ్చారు. మా యూనివర్సిటీలో ఏరోనాటిక్స్ డిపార్టుమెంటు ప్రారంభించాక గెలిచిన తొలి పోటీ అదేనట! అలా తొలిసారి మా హెచ్ఓడీ మన్ననలు అందుకున్నాను. నాటి నుంచీ దక్షిణాది రాష్ట్రాల్లో ఏరోనాటిక్స్‌కి సంబంధించి ఏపోటీ జరిగినా నన్నే పంపించసాగారు. అలా మూడేళ్లలోనే మూడొందల పోటీల్లో ఫస్ట్‌ప్రైజ్ సాధించాను. ఈ ప్రాజెక్టుల న్నింటినీ డిజైన్ చేయడానికి నాకు కంప్యూటర్ కావాల్సి వచ్చేది. అందువల్ల మా హెచ్ఓడీ అనుమతితో రాత్రి తొమ్మిదింటిదాకా ల్యాబ్‌లోనే ఉండి పనిచేసేవాణ్ణి. అక్కడి నుంచి ఇంటికి రావడానికి మరో రెండుగంటలు పట్టేది. మళ్లీ ఉదయం నాలుగింటికి లేచి బయల్దేరాల్సి వచ్చేది. ఓ రోజు మా అమ్మ తన మెడలోని తాళి అమ్మి ఏడున్నరవేలు నా చేతిలో పెట్టింది. ఎందుకమ్మా అంటే 'కంప్యూటర్ కొనుక్కోరా' అంది, దాంతో ఓ సెకండ్‌హ్యాండ్ ల్యాప్‌టాప్ తీసుకున్నాను. ఓసారి నీటి నుంచి హైడ్రోజన్‌ని వేరుచేసి..అప్పటికప్పుడే దాన్ని ఇంధనంగా మండించి బైక్‌ని నడిపించే సరికొత్త సాంకేతికతని ఆవిష్కరించాను. దానికి తమిళనాడు ప్రభుత్వం నాకు డాక్టర్ 'ఏపీజీ అబ్దుల్‌కలాం యంగ్ సైంటిస్టు' అవార్డు కింద..లక్ష రూపాయలు బహుమతిగా అందించింది. ఆ ఉత్సాహంతో మొక్కల నుండి విద్యుత్తుని రూపొందించి మొబైల్‌ఫోన్లని ఛార్జ్ చేసే పరికరాన్ని రూపొందించి పేటెంట్ సాధించాను. పుణెలో జరిగిన ఓ పోటీలో నెగ్గి రెండున్నర లక్షలు అందుకున్నాను. అయితే ఈలోగానే జీర్ణాశయ కేన్సర్‌తో మా కళ్లెదుటే అమ్మ చనిపోయింది. పరిశోధనపై దృష్టిని సారించాను.

1336 మంది విద్యార్థులకి శిక్షణ ఇచ్చి శాటిలైట్‌లు తయారుచేయించాం. రాకెట్ ద్వారా కాకుండా సరికొత్తగా పెద్ద బలూన్ ద్వారా వాటిని నింగిలోకి వదిలాం. ఆ ఫీటు గిన్నెస్ బుక్‌లో స్థానం సాధించింది. ప్రధాని కార్యాలయం నుంచి అభినందన లేఖ కూడా వచ్చింది. అలా దేశంలో పలు పాఠశాలల కోసం ప్రాజెక్టు చేశాం. ఆ విజయం ఇచ్చిన ప్రోత్సాహంతోనే దేశంలోనే తొలిసారి 'హైబ్రిడ్' తరహా రాకెట్‌లని రూపొందించా లనుకున్నాను. దేశంలో ఎవరూ ఇప్పటిదాకా చేయని అలాంటి రీయూజబుల్ రాకెట్‌ని ఇటీవలే ప్రయోగించి..అది సాధించిన తొలి భారతీయ సంస్థగా రికార్డు సృష్టించాం.

మా సంస్థ భాగస్వామిగా అందులో రూ.435 కోట్లు మా నాన్నకీ చెందుతాయి. మా కంపెనీ గౌరవ ఛైర్మన్ కూడా ఆయనే ఉన్నారు.




# అరచేతిలో 'డిజిటల్ ట్విన్'

అర్ధరాత్రి ఆ నగరం నడిబొడ్డున ఓ అగ్ని ప్రమాదం జరిగింది. ఫైరన్ సిబ్బంది బయల్దేరారు. వాళ్లలా కదిలిన మరుక్షణం నుంచీ వాళ్ల ఫోన్‌లో ప్రమాదం చోటు చేసుకున్న స్థలానికి సంబంధించిన అతిదగ్గరి దారి, దాని మ్యాపూ రావడం మొదలయ్యాయి. అసలు ప్రమాదస్థలంలో నిప్పు ఎక్కడినుంచీ ఏ దిశగా వ్యాపిస్తుందో..అగ్నిమాపక సిబ్బంది ఎటువైపు నుంచి పనిచేయాలో చెప్పసాగారు. అగ్నిమాపక సిబ్బందికి సూచనలు ఇచ్చినట్టే ..పోలీసులనీ అంబులెన్స్‌లనీ గైడ్ చేసి అక్కడికి రప్పించారు. అందర్నీ ఇలా సమన్వయం చేయడంతో కేవలం రెండుగంటల్లోనే అగ్నిప్రమాదాన్ని అదుపులోకి తీసుకురాగలిగారు. ఇదేదో విదేశాల్లో కాదు..మనదేశంలోనే జరిగింది. నాగాలాండ్ రాజధాని కొహిమాలో చోటు చేసుకుంది. 'కంట్రోల్ రూమ్' నుంచి ఇలా అందర్నీ సమన్వయం చేసింది అధికారులే కానీ..దాన్ని సాధ్యం చేసింది మాత్రం 'డిజిటల్ ట్విన్' అని చెప్పాలి. కొహిమా నగరం తన డిజిటల్ ట్విన్‌తో ప్రమాదాలను మాత్రమే కాకుండా..ట్రాఫిక్‌ని చాకచక్యంగా నియంత్రిస్తోంది. ప్రతి ఇల్లూ రోజూ ఎంత కరెంటు ఉపయోగించుకుంటుందో చెబుతూ విద్యుత్తు దుర్విని యోగాన్ని అడ్డుకుంటోంది. ఒక్క కొహిమానే కాదు కాన్పూర్ పట్టణం కూడా ఇటీవలే తన 'డిజిటల్ ట్విన్'ని సృష్టించుకుంది. ముంబయి, కొచ్చీనగరాలూ ఇదే బాట పట్టాయి. అయోధ్య వారణాసీలు కూడా ఇందుకోసం ముస్తాబ వుతున్నాయి. అంతెందుకు వచ్చే ఐదారేళ్లలో దేశంలోని వంద నగరాలకి 'డిజిటల్ ట్విన్'ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. సుమారు వెయ్యికోట్లకి పైగా ఇందుకోసం ఖర్చు పెట్టబోతోంది. అందులో తెలుగు నగరాలూ భాగస్వామ్యం కాబోతున్నాయి.

## నమూనా లోకం!

మీరు ఏ కలెక్టరేట్‌కో ఎస్పీ కార్యాలయానికో వెళ్లారనుకుందాం. అక్కడ మీ జిల్లా లేదా నగరానికి సంబంధించిన మ్యాపుతో పాటూ ఓ బొమ్మ నమూనా కూడా ఉంటుంది! ఆ ప్రాంతంపైన ఓ ప్రాథమిక అవగాహన కోసం అలాంటి నమూనాని తయారుచేసి పెట్టుకుంటారు. దాని డిజిటల్ రూపమే..ఈ 'డిజిటల్ ట్విన్' అనుకోవచ్చు. కాకపోతే, ఇందులో ఆ ప్రాంతంలోని దాదాపు ప్రతి కదలికనీ అప్పటికప్పుడు రియల్‌టైమ్‌లో చూడొచ్చు. మనం ఇప్పుడు వాడుతున్న గూగుల్ మ్యాప్..'2డీ'లో లైవ్‌గా ఉంటుంది కదా! దాన్నే 3డీలో ఊహించుకోండి. అంటే ఓ నగరంలోని ప్రతి భవనమూ, ఇల్లూ, చెట్టూ, చేమా అన్నీ అణువణువూ యథాతథంగా మనకళ్లముందుకు వస్తుందన్నమాట. ఎంతగా అంటే అక్కడ చెట్లు ఉంటే అవి రోజుకి ఎంత మేరకు పెరుగుతున్నాయో కూడా అంచనా వేసేయొచ్చు. కేవలం ఉపరితలంపైనున్న విషయాలే కాదు..భూగర్భంలోని కేబుళ్లు నీటి పైపులైన్ డ్రైనేజీ వీడియోలూ కూడా లైవ్‌గా మనం చూడొచ్చు. దానికి రెవెన్యూ రికార్డులూ, మున్సిపల్ ట్యాక్స్ వివరాలూ, నీళ్ల విద్యుత్తు కనెక్షన్‌ల సమాచారమూ అనుసంధానమైపోతాయి. అధికారులు తమ కంప్యూటర్‌లోనో ఆప్‌లోనో వీటిని చూడొచ్చు. వీటితోపాటూ ఆ ప్రాంతంలోని వాతావరణ పరిస్థితుల అంచనాలూ ఇందులో భాగమైపోతాయి. భారీ వర్షం కురిసే సూచనల్లాంటివి ముందుగా తెలిసిపోతాయి. 'సరే, ఇవన్నీ ప్రభుత్వాలకే మేలు కదా..సామాన్యులకేమిటీ?' అన్న సందేహం రావొచ్చు. 'డిజిటల్ ట్విన్'ని రూపొందించుకున్న నగరాలన్నీ తాము సేకరిస్తున్న సమాచారాన్ని ప్రజలకి పంచుతున్నాయి. ఆస్తి పన్నూ, విద్యుత్తూ వాటర్ బిల్లులైనా ఇప్పటికన్నా వేగంగా సులువుగా కట్టడానికి వీలుంటుంది. పారిశుద్ధ్య సమస్యలైనా, శాంతి భద్రతలకి విఘాతమైనా క్షణాల్లో ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. ఇదంతా ఒక్క ఆప్‌తో మన అరచేతుల్లోకి వచ్చేస్తుంది.

## ఇలా చేస్తారు

ముందుగా 3డీ స్కానర్‌లు, డ్రోన్‌ల ద్వారానూ నగరం మొత్తాన్నీ షూట్ చేస్తారు. వీటన్నింటినీ రియల్‌టైమ్‌లో నమోదు చేసేలా అత్యాధునిక డ్రోన్ కెమెరాలని మోహరిస్తారు. వీటికి రెవెన్యూ విద్యుత్తు తదితర శాఖల వివరాలనీ అనుసంధానిస్తారు. ఏఐ, 5జీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అత్యాధునిక సాంకేతికతతో వాటిని కలిపి..ఓ ప్రత్యక్ష నమూనా నగరాన్ని తయారుచేస్తారు. ట్రాఫిక్ జామ్ నుంచీ వరద ముప్పు దాకా ఏ సమస్య వచ్చినా దాన్నెలా ఎదుర్కోవాలో ప్రత్యామ్నాయ మార్గాలేమిటో కూడా ఊహాత్మక వీడియోగా ఈ డిజిటల్ నగరం చూపించగలదు. అందుకే దీన్ని అరచేతిలో ఇమిడిపోయే అద్భుతమంటున్నారు. ■





# ఇల్లన్నాక..

ఇల్లన్నాక
అల్లరుండాలి
అడుగుల సవ్వడుండాలి
గోడల మధ్య
పరుగుల వంతెనలూగాలి
గదుల నిండా
శబ్దం ప్రవహించాలి.
అణువణువూ
చైతన్యమై ధ్వనించాలి.

ఇంటికప్పు కూలితేనేం?
నేల మీంచి పైకెత్తి
మళ్లీ అతికించవచ్చు.
వాళ్లను ఆపకండి
పిచ్చిగీతలని చెరిపేయకండి
మరో పికాసో
ఆ వేళ్లను ముద్దాడొచ్చు
వాళ్ల ఉరకలకు అడ్డు తగలకండి
ఒలింపిక్ పతకం చేజారవచ్చు

అడగనివ్వండి.. ఎన్ని ప్రశ్నలైనా
మరో కలాం
ఇలను రాలవచ్చు.
నీది కాని ప్రపంచంలో వాళ్లున్నారు
అదిలించకండి
కలలు చెదిరిపోతాయి.
వీలైతే
వాళ్ల మధ్యన దూకి
వెనుక నుంచుని
రైలాట ఆడండి
తలుపుల మాటున దాగి
పిల్లదొంగని పట్టుకోనివ్వండి.
అలజడి లేనిదే
ముందడుగు ఏది?
నొప్పులు లేనిదే
సృజన ఎక్కడిది?
కవిత్వం మళ్లీ రాసుకోవచ్చు..
వాళ్ల కలలకు
మీ అనుభవాల రెక్కలు తొడిగి
రోజూ కాసేపు
అలా ఎగిరి రండి.
వృద్ధాప్యం నిరర్ధకమెందుకవుతుంది?
అనుక్షణం అర్థవంతమై
వెలుగులీనుతుంది.

– రమణ వెలమకన్ని

## వలస వాగు

ఆకాశమెత్తు భవంతుల పునాదులు
అయినవాళ్లు
బీరువాలకు బీరువాలు నిండిన సొమ్ములు
దొంగలపాలు కాకుండా
పగలు రాత్రి నీ ఇంటి ముందు
భద్రతా గీతం పాడుతున్నవాళ్లు
వాళ్లంతా నా వాళ్లే.

వాళ్లు/ షాపింగ్ మాల్స్ గోదాములలో
బతుకు కలలు వెతుకుతున్న
పురావస్తు శాస్త్రవేత్తలు
మర్రిమాను నీడలో మొలుస్తున్న
లేలేత చిగురు ఆశలు.
రాట్నం తిరిగినప్పుడే బాగుంది
మగ్గం ఆడినప్పుడే బాగుంది
ఇప్పుడెక్కడిది
పట్నం మోజులో పడి
ఊరు కొట్టుకుపోతున్నది.


– గజ్జెల రామకృష్ణ

ఎన్ని మేఘాలు ఒరుసుకున్నాయో
ఎంత వర్షధార కురిసిందో తెలియదు

## అక్షర దాహం

కానీ తలపుల చూరునుంచి రాలే ఒక్కో చుక్క
ఎందుకోగాని భద్రంగా ఒడిసి పట్టాను.
బిందువు బిందువు కలిసి సింధువైనట్టు
దాచిపెట్టుకున్న వర్ష బిందువుల్లో/ ఓ అక్షరాల కడలి
అవగతమయింది./ కావ్య కన్యకల నాట్యహేల
కనువిందయింది./ అనుభవాల, అనుభూతుల హోరు
క్షణక్షణానికి ఉవ్వెత్తున లేచి విరిగిపడే
కెరటాల రొదలే కథలుగా వినిపిస్తూ
గుప్పెడంత గుండెను సుడిగుండం చేస్తుంది.
ఎడతెరిపి లేని వర్షం కోసం ఎదురుచూపు
తలపుల చూరునుంచి రాలే బిందువులు కాదు
ఎడారి ఇసుకలో ఇంకిపోయే ఒక్కో బిందువు
ఆత్మకథ అక్షరసత్యంగా ఆవిష్కరించాలని
ఇసుకలో మునివేళ్లతో చెలమ తవ్వుతున్నా
దాహం తీర్చే అక్షరాల నీటిఊట ఊరాలని.

– డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి



# పుస్తక సమీక్ష

## రాజా గణేష్ కథలు




వివిధ ప్రక్రియల్లో యల్.రాజాగణేష్ వెలువరిస్తున్న పదవగ్రంథం ఈ కథల సంపుటి. మొత్తం 21 కథలు. అన్నీ పలు పత్రికల్లో అచ్చయినవే. కథలన్నీ మానవ సంబంధాలను పెనవేసుకుని, మనోవిశ్లేషణాత్మకంగా సాగిపోతై. స్నేహితులిద్దరూ ఒకే అమ్మాయిని ప్రేమిస్తారు. ఒకరు వ్యక్తపరుస్తాడు..మరొకరు ప్రేమను గుండెల్లోనే దాచుకుంటాడు. వ్యక్తమయిన వ్యక్తితో ఆ అమ్మాయి వివాహం జరగదు. పిచ్చోడై తిరుగుతుంటాడు. అనుహ్యా పరిస్థితుల్లో స్నేహితులిద్దరూ కలుసుకుంటారు. ప్రేమరాహిత్యం ఇద్దరు స్నేహితుల్ని ఎంతగా కలవరపెడ్తుందో తెలియజేసిన కథ 'ప్రేమరాహిత్యం'. 'ప్రతిస్పందన' మరో ప్రేమకథ. విడిపోయిన ప్రేయసీ, ప్రియులు ఒకరినొకరు కలవరిస్తు, విరహంతో జీవిస్తు చివరకు కలుసుకుని కథని సుఖాంతం చేస్తారు. లంచాలకోసం కార్యార్థుల్ని పట్టిపీడించే ఓ అవినీతి అధికారి కథ 'నిప్పుల్లోనీరు', ఎంత దారుణంగా మరణం అతడ్ని ఆవహిస్తుందో చదివి తెలుసుకోవాల్సిందే. ఎమ్.వి.వి.సత్యనారాయణ తన పీఠికలో అభిప్రాయపడినట్లు రాజాగణేష్ కథల్లో కొసమెరుపులు, ఆకస్మిక మలుపులు, ఊహించని ముగింపులు వండవు. సాదాసీదాగా నడుస్తాయి కథనాలు.

**(ఒకే విత్తనం-మూడు మొలకలు, రచన: యల్.రాజాగణేష్, వెల: రూ 150, ప్రతులకు: 26-47-1, చైతన్యనగర్, పాతగాజువాక, విశాఖపట్నం)**

**- తన్మయి**

## వేదకాల సమాజంపై లోతైన చూపు



నాలుగు వేదాలలో మొదటి వేదం అధర్వణవేదం. సామవేదం ఋగ్వేదానికి సంగీత రూపమే. కనుక వేదాలు మూడే (8). కార్తికేయుని 'గాంగేయుడు' అని కూడా అంటారు. నేడు 'మహెంజొదారో' అని పిలవబడే ప్రాంతమే, నాటి లంకానగరం (74). నేటి హరప్పానగరమే నాటి అయోధ్య (76)-లాంటి నమ్మశక్యం కాని వివరాలతో మనముందుకు వచ్చారు రచయిత, పరిశోధకుడు డి.వెంకట సత్యజనార్ధన్‌ప్రసాద్. 'మన వేదములు, రామాయణ భారత్‌ల్లోని వివిధ అంశములను చరిత్రకారులు చారిత్రక సంఘటనలుగా గుర్తించటం లేదు. ఈ పుస్తకం మన ప్రాచీన సంస్కృతికి చారిత్రక రుజువులు వెదికి పట్టటానికి ఉద్దేశించ బడినది' (పే 4) అని అంటున్న రచయిత జనార్ధన్‌ప్రసాద్ ఈ సంపుటిని 49 అధ్యాయంగా చేసి, చివరి అధ్యాయంగా తన ప్రతిపాదనలకు ఆధార వ్యాసాల పట్టికను కూడా ఇచ్చారు. భారతదేశంలో జనావాసాలు నేడు ఆఫ్ఘనిస్థాన్ పాకిస్థాన్, పంజాబు ప్రాంతాలలోనే ఉండేవట! రచయిత ప్రతిపాదించిన విషయాలలో నిజమెంతో తెలియదు కాని వీరి ఆలోచనా పరిధి, సిద్ధాంతాల ప్రతిపాదన పాఠకులకు ఆసక్తి కలిగిస్తుంది. ఆసక్తులు మరింత లోతుకు శోధించేందుకు తోడ్పడుతుంది. రచయితకు అభినందనలు.

**(ప్రాచీన భారతీయులకు అక్షర సుమాంజలి, సంపాదకుడు: డి.వి.ఎస్.జనార్ధన్‌ప్రసాద్, వెల రూ: 499, ప్రతులకు: ఇం.నం.14-6-12/3, రాయ్‌పేట్, నరసరావుపేట)**

**- కూర చిదంబరం**

## చక్కటి కథాకావ్యం 'ప్రాంజలి'

జె.వి.పబ్లికేషన్స్ ద్వారా ఈ పుస్తకం ముద్రించారు. దువ్వూరు సత్యనారాయణ, రావు, దీప్తిపెండ్యాల, చక్కటి విలువైన ముందుమాటలు రాసారు. పౌరాణిక గాథల్లోని కొన్ని కథలు (ఘట్టాలు) దాదాపు 24 భారతీయంలో రాసారు. అలాగే విశ్వకావ్యంలో 23 అంశాలతో, పురాణ కథలు పేజిపార్ట్-1 గంగావతరణం, సాగర మథనం, అరణ్యకాండం, పార్ట్-2లో వేదవతి





అశోకవనం, శ్రీరామపట్టాభిషేకం, జానకి, మారుతి, వాల్మీకి ఆశ్రమంలో సీతలాంటి 15 అంశాలు, పార్ట్-3లో నిమిచరిత్ర, లవణాసురుడు, రాజసూయము, అశ్వమేధ యాగము, లవకుశుల రామకథాగానం, రామరాజ్యం, మైథిలీ మనోహారం అనే దాదాపు 10 అంశాలు తీసుకొని రాసారు. ఆధ్యాత్మిక-పౌరాణిక కథాప్రియులకు ఈ పుస్తకం చక్కటి కరదీపిక. భరతుడు ఏలిన రాజ్యం భారతదేశం, అర్యుల నివాస స్థానం కనుక 'ఆర్యావర్తనం' అనే పేర్లు వచ్చాయంటారు. నార దముని సూక్తులు విని వ్యాసమహర్షి 'శ్రీమద్భావగతం' రాసారు. చాలాసార్లు విన్నకథలైనా సూక్ష్మంగా అందరికీ అర్థం అయ్యేలా రామాయణ భారతాన్ని రాసిన గిరిజాహరి అభినందనీయం.

**(ప్రాంజలి, రచన: గిరిజా హరి కరణం, వెల: రూ 270, ప్రతులకు: రాజీవ్ కరణం 7-1-26/బిటి/304, భానుడీలక్స్ టవర్స్, లీలానగర్, అమీర్‌పేట, హైదరాబాద్)**

**- తంగిరాల చక్రవర్తి**

## ఆచార్య ఫణీంద్ర సాహితీ ఉషోదయం

డా॥ఆచార్య ఫణీంద్ర 19వ శతాబ్ది తెలుగుసాహిత్య చరిత్రను క్షీణయుగం కాదు, ఉషోదయయుగంగా పరిగణించాలని ఆ శతాబ్దిలో మరుగునపడిన కావ్యాలను సేకరించి, ఆ శతాబ్దం అంధయుగం అనే అపప్రధను పోగొట్టడానికి అపూర్వ పరిశోధనతో సిద్ధాంత గ్రంథం




వెలువరించడం అభినందనీయం. నాయకరాజుల కాలం వరకు అవిచ్ఛిన్నంగా బహిర్గమైన తెలుగు సాహిత్య చరిత్ర అక్కడ నిలిపివేసి, నూరు నూటయాభై సంవత్స రాలు ముందుకు జరిపి, ఒక యుగానికి న్యూనతాభావాన్ని పులిమి అంధయుగమని దాట వేయడం, ఆ శతాబ్దిలో అధమస్థాయి కవిత్వం వచ్చిందని తేల్చిపారేయడం ఎంతవరకు సబబు? అని డా॥ఫణీంద్ర నిలదీయడమే కాకుండా '19వ శతాబ్ది తెలుగు కవిత్వ నవ్యతపై 11 అధ్యాయాలలో, అద్భుత పరిశోధనా వెలుగులు ప్రసరింపచేసారు. గురజాడకంటే నూరేళ్లముందే రేవణూరి వెంకటార్యుడనే కవి 'శ్రీపాదరేణు ప్రభావం' అనే కావ్యంతో ముత్యాలసరం రాయడం అనే అద్భుత పరిశోధనాంశం డా॥ ఫణీంద్ర వెలుగులోకి తేవడం, అంధ యుగం కాదంటూ నిర్ద్వంద్వంగా ఉషోదయ యుగంగా ధృవీకరింప చేయడం నిస్సందేహంగా ఈ సిద్ధాంత రచన, 19వ శతాబ్దిని రానున్న మహోదయానికి వైతాళికగీతం ఆలపించిన ఉషోదయంగా ఆవిష్కరింపచేసింది. **(ఉషోదయ యుగం, రచన: డా॥ఆచార్య ఫణీంద్ర, వెల: రూ 300, ప్రతులకు: యువభారతి, తెలంగాణ సారస్వత పరిషత్, తిలక్‌రోడ్, హైదరాబాద్)**

**- యర్రమిల్లి**

# సుందర హిల్‌స్టేషన్ మున్నార్

షేక్ అబ్దుల్ హకీం జాని

దక్షిణ భారతదేశంలోని కేరళరాష్ట్రంలోని ఇడుక్కీ జిల్లాలో అత్యంత ప్రాచీనమైన వేసవి విడిది మున్నారు. చుట్టూ కొండలు, జాలువారే జలపాతాలు, చల్లటి గాలి, ఆహ్లాదపరిచే టీ తోటలు వీటన్నింటికంటే మిన్నగా సముద్ర మట్టానికి పన్నెండు వేల అడుగుల ఎత్తులో టాప్‌హిల్స్‌పై అడుగిడితే మేఘాలు మన మీదుగా పయనిస్తుంటాయి. మున్నార్ వెళితే ఈ అనుభూతులను మదిలో పదిలం చేసుకోవచ్చు. మున్నార్ హిల్‌స్టేషన్ మూతిరపుళా, నల్లతాని, కుందాల అనే మూడు పర్వత వాగులు సంగంలో ఉన్నది. మూడువాగుల సంగమ ప్రదేశం కావడం చేత దీన్ని స్థానికులు (మూన్‌ఎరా) మూడు సెలయేళ్లు అని పిలుస్తారు. ప్రకృతిలోని అందాలన్నీ మున్నార్‌లో కుప్పపోసినట్లు అనిపిస్తుంది. ఈ రమణీయ అందాలను చూసి పర్యాటకుల హృదయం ఉల్లాసంతో ఉరకలేస్తుంది. ఇక్కడ ఎప్పుడు వర్షం పడుతుందో, ఎప్పుడు కురవదో ఖచ్చితంగా చెప్పలేం. అప్పటికప్పుడు మేఘాలు నాట్యం చేస్తున్నాయి అన్నచందన వర్షం పడుతుంది. ఇక్కడి కొండలలో శ్రీగంధం తోటలు, ఆహ్లాదపరిచే ఉద్యానవనాలు ఒకటేమిటి మున్నార్‌లో ప్రతిదీ మైరపిస్తుంది. మున్నార్‌ను నాటి బ్రిటిష్ పరిపాలకులు దక్షిణ భారతదేశంలో వేసవి విడిదిగా ఉపయోగించుకున్నారు. నీలకురింజి పుష్పం ఈ పర్వత సానువుల్లో విరబూసినప్పుడు, పర్వతాలు నీటి దుప్పటి కప్పుకున్నట్లుగా అలముకున్న సమయంలో ఈ పర్వతం పంక్తుల సౌందర్యాన్ని తిలకించడానికి పర్యాటకులు తండోపతండాలుగా తరలి వస్తారు. పశ్చిమ కనుమలకు చెందిన ఈ పుష్పం ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒక్కసారి పుష్పిస్తుంది. ఇక్కడి అడవులు, గడ్డిమైదానాల్లో కనిపించే అద్భుతమైన పుష్ప సంపదలో నీలకురింజి ఒకటి. ఈ పువ్వు ఇక్కడి కొండల్లో 12 సంవత్సరాలకు ఒక్కసారి పూస్తుంది. గతంలో 2018లో నీలకురింజి పుష్పం ఇక్కడ పూసింది. తిరిగి 12 సంవత్సరాల తరువాత 2030లో ఈ పువ్వు ఇక్కడ పుష్పస్తుంది. నీలకురింజి పువ్వు వృక్షశాస్త్ర నామం



స్ట్రోబిలాంథెస్. కుంతి నది నుండి ఈ పుష్పం ఉద్భవించిందని కొందరు చెబుతుంటారు. ఆ కారణంగా ఈ పువ్వును కుంతియానస్ అని కూడా పిలుస్తారు. స్థానిక పరిభాషలో నీల అంటే నీలం రంగు, కురింజి అంటే పువ్వు అని అర్థం. కురింజి పూలు మున్నార్ కొండలపై పూసినప్పుడు ఈ ప్రదేశమంతా నీలం వర్ణంతో పరమాద్భుతంగా కనిపిస్తుంది. 12 సంవత్సరాలకు ఒకసారి కనిపించే నీలకురింజి పుష్పాన్ని తిలకించాలంటే మున్నార్‌లోని దేవికులం తాలూకాలోని కొత్తకంబూర్, పట్టవాడ గ్రామాలకు వెళ్లవలసి ఉంటుంది.

ఉండే వాతావరణం టీ మొక్కల పెంపకానికి అనువుగా ఉంటుంది. మున్నార్ టీ తోటలు పర్వతాలపై ఆకుపచ్చని తివాచీని పరచిన రీతిలో కానవస్తాయి. కొచ్చి నుంచి మున్నార్ 130 కి.మీ. దూరం ఉంటుంది. హనీమూన్ జంటలు ఇక్కడకు వచ్చి సేదతీరుతారు. అతిపెద్ద ఏనుగులపై కూర్చుని ఇక్కడ ప్రకృతి దృశ్యాలను తిలకించవచ్చు. స్వేచ్ఛగా తిరిగే ఏనుగులు కూడా ఇక్కడ కానవస్తాయి. అతిపెద్ద పడవలపై ఇక్కడ ఇళ్లు నిర్మించి ఉంటాయి. వీటిని హౌస్ బోట్లు అని పిలుస్తారు. పర్యాటకులుగా వచ్చిన హనీమూన్ జంటలు ఈ పడవలపై నిర్మించిన ఇళ్లల్లో బస చేసి నీటిపై విహరిస్తూ మున్నార్ అందాలను తిలకిస్తూ ఉంటారు. మూడురోజులు, వారం, నెల ఇలా పర్యాటకులు బసచేసిన కాలాన్ని బట్టి ప్యాకేజీ ప్రకారం డబ్బును వసూలు చేస్తారు. అక్కడకు వెళితే ఆకాశంలో ఉన్నామా? అనిపిస్తుంది. ఆవరించిన తెల్లటి పొగమంచు, అప్పుడప్పుడు జల్లులు, వీటి మధ్య కొండపై తిరగడం వింతైన అనుభూతి, అవి కాకుండా ఏనుగులు తిరిగే అటవీ ప్రాంతం, అంతరించిపోతున్నాయని చెబుతున్న పర్వత మేక నీలగిరి తహర్ ఇక్కడ కనిపిస్తుంటాయి. ఇక్కడి పర్వత శిఖరాలపై 12 సంవత్సరాలకోసారి మాత్రమే గుట్టలు గుట్టలుగా కురింజిపూలు విరబూసి కనువిందు చేస్తాయి.

**ఎకో పాయింట్:** నదీ తీరాన ఒకవైపు అందమైన చెట్లతో, మరోవైపు పచ్చిక బయళ్లతో నిండివున్న ఎకో పాయింట్ దర్శించదగినది.

**నీలగిరి తార్:** ఇది అరుదైన జంతువు. ఎరవికులం జాతీయ పార్కులో ఈ జంతువును తిలకించవచ్చు.

## ఎరవికులం నేషనల్ పార్క్

మున్నార్ పక్కన ప్రధాన ఆకర్షణ ఎరవికులం నేషనల్ పార్క్ అని చెప్పవచ్చు.

ఇది అంతరించిపోతున్న నీలగిరి తార్‌కు ఫేమస్. 97 చదరపు కిలోమీటర్ల విస్తార్ణంలో విస్తరించిన ఈ పార్కు అనేక రకాల అరుదైన సీతాకోక చిలుకలు,

జంతువులకు నిలయం. ఇదో పక్షులకు కేంద్రం. ఇది ట్రెక్కింగ్‌కు గొప్పస్థలం.

ఆనముడి పర్వత శిఖరం: ఎర్వికులమ్ జాతీయ ఉద్యానవనం లోపల ఉన్నది ఆనముడి పర్వతశిఖరం. దక్షిణ భారతదేశంలోనే అతి ఎత్తైన పర్వతశిఖర ఆనముడి ఉంది. దీని ఎత్తు 2,695 మీటర్లు. ఆనముడి ట్రెక్కింగ్ చేయడానికి ఎరవికులంలోని ఆటవిక, వన్య సంరక్షణ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.



**మట్టుపెట్టి:** మున్నారు పట్టణం నుంచి 13కిలోమీటర్ల దూరంలో మట్టుపెట్టి ఉంది. ఇది సముద్రమట్టానికి 1700 మీటర్ల ఎత్తులోఉన్నది. ఇక్కడ స్టోరేజీ డ్యామ్, అందమైన సరస్సులు ఉన్నాయి. చిన్న పడవల్ల ఇక్కడ విహరించవచ్చు. మట్టుపెట్టిలో ఇండో స్విస్ ప్రాజెక్ట్ కింద నడుస్తున్న డెయిరీ ఫాం ఎంతో ప్రముఖమైనది. ఇక్కడ అత్యంత పాల దిగుబడి వచ్చే ఆవులు ఉన్నాయి.

**పల్లివాసల్:** ఇది మున్నారు చిత్తిరపురం నుంచి 3కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఇది కేరళలోని మొదటి హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్‌కు వేదిక. ఇది అద్భుతమైన దృశ్యసౌందర్యానికి కేంద్రం. సందర్శకులు దీన్ని ఒక ప్రముఖ పిక్నిక్ కేంద్రంగా పరిగణిస్తున్నారు.

**చిన్నకనాల్-ఆనయిారంగల్:** మున్నార్‌కు దగ్గరల్లో చిన్నకనాల్ ఉంటుంది. ఇక్కడ ఉండే వాటర్ ఫాల్స్‌ను పవర్‌హౌస్ వాటర్‌ఫాల్స్ అని అంటారు. పశ్చిమఘాట్ శ్రేణిలోని అందమైన దృశ్యాలకు కేంద్రంగా ఉంటుంది. చిన్నకనాల్ నుంచి ఏడు కిలోమీటర్లు ప్రయాణిస్తే మీరు ఆనయిారంగల్ చేరుకుంటారు. మున్నార్ నుంచి 22కిలోమీటర్ల దూరంలో ఉండే ఆనయిారంగల్, టీ తోటలతో పచ్చని కార్పెట్‌లా ఉంటుంది. అద్భుతమైన రిజర్వాయర్‌పై ట్రిప్పు ఒక మరపురాని అనుభూతిని మిగిలిస్తుంది.

ఆనయిారంగల్ డ్యామ్ చుట్టుపక్కల టీ తోటలు, పచ్చని అడవులుంటాయి.



**టాప్‌స్టేషన్:** మున్నారు నుంచి 3కిలోమీటర్ల దూరంలో సముద్ర మట్టానికి 1700 మీటర్ల ఎత్తులో ఉంటుంది. మున్నార్-కొడైకనాల్ రోడ్డులో ఇది గరిష్ఠస్థానం. మున్నారును సందర్శించే సందర్శకులు తప్పనిసరిగా టాప్‌స్టేషన్‌ను సందర్శించాల్సిందే. ఇక్కడ నుంచి పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్రం అందాలను ఆస్వాదించవచ్చు. ఎంతో విశాలమైన ప్రాంతంలో విరబూసే నీలకురింజి పుష్పాలను చూడటం కోసం మున్నారులో ఇది ఎంతో అనుకూలమైన ప్రదేశం.

**టీ మ్యూజియం:** టీ తోటల ఆవిర్భావం, వృద్ధికి సంబంధించి మున్నారుకు ఘనమైన పూర్వచరిత్రే ఉన్నది. దీన్ని కన్నాన్ దేవన్ టీ మ్యూజియం అని పిలుస్తారు. ఈ పూర్వచరిత్రను సంరక్షించడం కోసం, కేరళ గరిష్ట ఎత్తులో సాగించే టీ తోటలు గల సాగులోని ఆసక్తికరమైన అంశాలను ప్రపంచానికి తెలియచేయడం కోసం మున్నారులో టాటా టీ ద్వారా టీ కోసం ప్రత్యేకమైన ఒక మ్యూజియంను ఏర్పాటు చేశారు. ఈ టీ మ్యూజియంలో అనేక ఆసక్తికరమైన వస్తువుల, ఫొటోగ్రాఫ్‌లు, యంత్రాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా మున్నారు ప్రాంతంలో టీ తోటల అభివృద్ధికి సంబంధించి మనకు అనేక కథలు చెబుతాయి. మున్నార్‌లోని టాటా టీ కి చెందిన నల్లతన్ని ఎస్టేటులో ఉన్న ఈ మ్యూజియంను తప్పక సందర్శించాల్సిందే.

ఒక రోజంతా వంపులు తిరిగిన టీ తోటల మధ్య సేద తీరువచ్చు. కొండలపై జాలువారే సెలయేర్లు గొప్ప అనుభూతిని కలిగిస్తాయి. వేల అడుగుల ఎత్తున ఉన్న కొండల నుంచి నీళ్ల జాలువారే దృశ్యం మనోహరంగా ఉంటుంది. మున్నార్‌కు దగ్గరలోని డ్యాంలో బోటింగ్ చేయవచ్చు. మున్నార్‌కు 20కిలో మీటర్ల దూరంలో టాప్‌హిల్స్ అనే ప్రాంతం సముద్ర మట్టానికి పన్నెండు వేల అడుగుల ఎత్తున ఉంది. ఈ కొండపై నుంచి లోయలోకి చూస్తే ఒళ్లు జలదరిస్తుంది. ఇక్కడ కుందల డ్యామ్, చిన్నకనాల జలపాత చూడదగినవి. ఎత్తైన కొండలపై నుండి నీరు జలజలా జాలువారుతూ సుందరంగా కనిపిస్తుంది. పార్కులో నుంచి టీ తోటలు, ఆపై తుషార బిందువుల దుప్పటిని కప్పుకున్న కొండల అద్భుతమైన దృశ్యాన్ని వీక్షించవచ్చు. చొక్రముడి శిఖరం, డ్రీమ్‌లాండ్ మున్నార్ సాహసాల పార్కు, కుందల సరస్సు, లక్కోమ్ జలపాతం, లాక్‌ఆర్ట్ గ్యాప్, మెట్టుపెట్టి డ్యామ్, కొలుక్కుమలై టీ ఎస్టేట్, చిన్నార్ వైల్డ్‌లైఫ్, దేవీకులం, మున్నార్ రోజ్‌గార్టెన్ ఇత్యాదివి పర్యాటక స్థలాలు మున్నార్‌లో చూడదగినవి.

## పర్వతారోహణ

దక్షిణ భారతదేశంలో కెల్లా అతి ఎత్తైన పర్వతమైన అవముడి శిఖరం మూడుగంటల పర్వతారోహణ సౌకర్యాన్ని కల్గిస్తుంది. అనుముడి అంటే ఏనుగు దంతం అని అర్థం. పర్వతారోహణ మొదలయ్యే ప్రాంతాన్ని న్యామకడ్ అని పిలుస్తారు. ఇది మున్నార్‌కు 13 కి.మీ దూరం లో ఉంది. ఇక్కడకు 40 కి.మీ. దూరం లో ఉన్న యదయూర్‌లోని చందనపు అడవుల, తూవనమ్ జలపాతాలు పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఇక్కడకు 60 కి.మీ. దూరంలో చిన్నార్ వైల్డ్ సాంక్చురీ మనదేశంలో ప్రముఖమైనది. దీనిలో ఏనుగులు, జింకలు ఇత్యాది జంతువులను తిలకించవచ్చు. మున్నార్ కొండలపై నిండిన అటవీ ప్రాంతం పలురకాల పక్షుల కు నివాసస్థలం. పక్షి పరిశోధకులు ప్రతిఏటా మున్నార్‌ను దర్శిస్తుంటారు. మున్నార్‌లోని చితిరాపురం నుండి 3.కి.మీ. దూరంలో పల్లివాసల్ నెలకొనివుంది. ఇక్కడ ప్రకృతి అందాలు రమణీయంగా ఉంటాయి. గోల్ఫ్, టెన్నిస్ ఫిషింగ్ ఇత్యాది వ్యాపకాలను బాగా ఇష్టపడేవారు కూడా ఇక్కడ కనిపిస్తారు.





కథ

# తప్పిన అపాయం

వీరపు నాయని పల్లిని వీరసూరుడు పాలించేవాడు. అతని ఆస్థానంలో అనంతుడు, అతిథుడు అనే ఇద్దరు సైనికులు వుండేవారు. రాజ్యంలో ఏమి జరిగినా వారిద్దరూ గూఢచారులుగా వ్యవహరిస్తూ తగిన విశ్వసనీయ సమాచారం అందిస్తుండేవారు. ఎలాంటి సమస్యలైనా వారి సాయంతో రాబట్టి పరిష్కరించేవాడు. ఒక్కోసారి రాజ్యంలో రాజుగారి భవనాలకు నిప్పు అంటుకుని రావణకాష్టంలా దహించుకునిపోయి విలువైన వస్తుసామగ్రి కాలి బూడిది అయ్యేది. ఇలా ఎందుకు జరుగుతుందో తెలియక రాజు తలపట్టుకు కూర్చుని దీర్ఘంగా ఆలోచించేవాడు. ఈపని ఎవరు చేస్తున్నారో నిఘావేసి కనుక్కోవాలని తన గూఢచారులైన ఇద్దరు సైనికులను ఆదేశించాడు.

ఆ ఇద్దరు సైనికులు అదోలా చూసి, 'సరే ప్రభూ!' అని తల ఊపారు. మరుసటి రోజు ఇద్దరు చింపిరి జుట్టుతో వున్న మనుషులను లాక్కొచ్చి రాజు ముందు వుంచారు. ఏమీ తెలియని అమాయకులైన ఆ ఇద్దరూ భయంతో వణుకుతూ రాజువద్దకు వచ్చి నిలబడ్డారు.

'నిప్పు పెట్టే పని ఎవరు చేస్తున్నారో చెప్పండి..? లేదంటే ఉరిశిక్ష వేస్తాను..!' హూంకరించాడు రాజు.

ఇద్దరి వెన్నులో భయం పట్టుకుంది.

'ప్రభూ..ప్రభూ మీకు దండాలు..అంత పని చేయకండి..మా పిల్లలు అనాథలు అవుతారు..' రాజు కాళ్లమీద పడ్డారు.

వాళ్లు అలా వేడుకోవడంతో వీరసూరుడి మనసు వెన్నలా కరిగిపోయింది.

'పో వెళ్లండి..ఇలా ఇంకోసారి చేశారంటే చంపేస్తా..!' అని హెచ్చరించి విడిచిపెట్టాడు.

కొద్ది రోజులు సమస్య తాత్కాలికంగా సమసిపోయింది. వీరసూరుడికి హాయిగా కంటిమీద కునుకు పడుతున్నవేళ మరో సమస్య వచ్చి పడింది.

ఈసారి రాజు జారీ చేసే కరెన్సీ నోట్లకు బదులు నకిలీ నోట్ల సమస్య పడింది. ఏది అసలు నోట్లో, నకిలీ నోటో తెలియక ప్రజలు తికమక పడ్డారు.

వీరసూరుడికి నకిలీ నోట్ల గుట్టు తెలుసుకోవడం కష్టంగా మారింది. రాజ్యంలో తమ యంత్రాగాన్ని పూర్తి నిఘా వుంచాడు. అయినా ఏమాత్రం కనుక్కోలేకపోయారు.

ఈ సమస్య రాజుకు కొరకరాని కొయ్యగా మారింది. మళ్లీ రాత్రుల్లో నిద్ర కరువైంది. ఈసారి మెరుపులాంటి ఆలోచన వచ్చి అమలు చేశాడు. నోట్లు రద్దుచేసి వస్తు మార్పిడి పద్ధతి ప్రవేశపెట్టాడు. పరిస్థితి చక్కబడిన తర్వాత నోట్లు పద్ధతిని పునరుద్ధరించాడు. మళ్లీ నకిలీ నోట్ల సమస్య ఎదురైంది. ఈసారి దీర్ఘంగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు.

దొంగనోట్లు తమ వద్దకు తీసుకొచ్చిన వారికి రెండుపది గ్రాముల బంగారు కానుకగా ఇస్తానని దండోరా ప్రకటించాడు. ఇది విన్న నలుగురి వ్యక్తులు ఎంతో ఆశపడి తాము చెలామణి చేస్తున్న ఓ బస్తా దొంగనోట్ల కట్టలను రాజు వద్దకు తీసుకెళ్లారు.

'ఇదిగోండి..మీరు అడిగిన దొంగనోట్లు..అన్ని ఇచ్చేస్తున్నాం..మీరు ప్రకటించిన పది గ్రాముల బంగారం ఇప్పించండి ప్రభూ వెళ్లిపోతాం' అని ప్రాధేయపడ్డారు.

వారిని చూసిన రాజుకు చిర్రెత్తుకొచ్చింది. ఇన్నాళ్లు దొంగనోట్లతో నిద్ర లేకుండా ముప్పుతిప్పలు పెట్టిన వారికి జీవిత కారాగార శిక్ష విధించాడు.

ఆ తర్వాత నకిలీ నోట్ల సమస్య తలెత్తలేదు. ప్రజలు, రాజు ప్రశాంత జీవనం గడిపారు. రాజు ఉపాయంతో అపాయం తప్పించి సమస్యను పరిష్కరించినందుకు ప్రజలు ప్రశంసల జల్లు కురిపించారు.

– బోగా పురుషోత్తం





# పసుల హరివిల్లు
## వార్త ఆదివారం

## బాలగేయం

### ఆమని రాక



కోయిల కూతే కమ్మగ
ఉంది
ఆమని రాకే హాయిగ ఉంది
రామచిలుకే
రారమ్మంటుంది
నెమలి కులుకే
వయ్యారంగుంది
పూల రంగే ఆశ్చర్యం
గుంది
పాల రంగే పకపక మంది
వానజల్లే దీవించింది
ఏరువాకై సాగమంది
కోతికొమ్మచ్చి ఆడమంది
సీతాకోకై ఎగరమంది
తూనీగల్లే తిరుగాడమంది
చీమలవల్లే శ్రమించమంది
పువ్వులవోలే నవ్వమంది
గువ్వల వోలే ఒదగమంది
మువ్వల వోలే ఉండాంది
రవ్వల వోలే వెలగాలంది.

– గుండాల నరేంద్రబాబు

## హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

### గిరీష్ అంకుల్ సమాధానాలు

- ఎ.ఫణికుమార్, గుంటూరు

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. టెలిఫోన్‌కూ, మొబైల్‌కూ మధ్యగల ప్రధానమైన తేడా ఏమిటి?

**జవాబు: ఫణికుమార్!** టెలిఫోన్‌లో చిన్న మైక్రోఫోన్ ఉంటుంది. ఇది గొంతు నుంచి వచ్చే శబ్దాన్ని(ధ్వనిని) విద్యుత్ సంకేతంగా మారుస్తుంది. టెలిఫోన్‌కు మరో అంచుభాగం అంటే చెవికి ఆనించుకునే భాగంలో ఒక చిన్న లౌడ్‌స్పీకర్ ఉంటుంది. ఇది విద్యుత్ సంకేతాలను ధ్వని రూపంలోకి మారుస్తుంది. అదే సెల్యులర్ ఫోన్‌లో అయితే చిన్న రేడియో ట్రాన్స్‌మీటర్, రిసీవర్ ఉంటాయి. ఇది రేడియో సంకేతాల ద్వారానే కాల్‌ను పంపిస్తుంది, గ్రహిస్తుంది. దీని గురించి వచ్చే సంకేతం ముందుగా దగ్గరలో ఉన్న బేస్ స్టేషన్‌కు చేరుతుంది. ఒక్కో బేస్ స్టేషన్ అదుపులో కొంత ప్రాంతం ఉంటుంది. దీనినే 'సెల్'గా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఫోన్ ద్వారా పంపిన కాల్ ఒక సెల్ నుంచి మరో సెల్‌కి అంటే ఒక బేస్‌స్టేషన్ నుంచి మరో బేస్‌స్టేషన్‌కు ప్రయాణిస్తుంది. దాంతో మొబైల్ ఫోన్ దానంతట అదే కావలసిన స్టేషన్‌కు అనుసంధానమవుతుంది.

ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మొబైల్ ఫోన్ 'రేడియో' లాంటిది. ఇద్దరు పరస్పరం మాట్లాడుకోవచ్చు. ఎలాంటి తీగల అవసరం లేకుండా రేడియో సంకేతం జనించే చోట ట్రాన్సిమీటర్ ఉంటుంది. అందుకునేందుకు రిసీవర్ ఉంటుంది. మొబైల్ ఫోన్‌కు రెండు వైపులా రెండు సాధనాలు (రేడియో ట్రాన్సమీటర్, రిసీవర్) ఉంటాయి కదా! దానికి సంబంధించిన మైక్రో ప్రాసెసర్ ఆధారిత పరికరం మాత్రం బేస్‌స్టేషన్‌లో ఉండి, దానికి మాత్రం బేస్‌స్టేషన్ నుంచి సంకేతాలు అందుకోవడం/ పంపడం చేస్తుంది. సెల్‌ఫోన్‌ల మధ్య సంకేతాలు విద్యుదయస్కాంత తరంగాలుగా సెకనుకు 3 లక్షల కి.మీ. ప్రయాణిస్తాయి.



# జంతువులను కాపాడుకుందాం

యం.వి.రామారావు

ఆధునిక కాలంలో మానవుడు ప్రకృతికి దూరం అవుతున్నాడు. యాంత్రికంగా జీవితాన్ని వెళ్లదీస్తున్న జీవులకు ఒక జీవితానుభవం కలుగుతుంది. పర్యాటక ప్రకృతి, ప్రేమికులకు ఇదోక వింత అనుభవం. ప్రకృతికి, జంతువులకి దగ్గరగా తీసుకువెళ్లి వాటి ప్రవర్తనపై అవగాహన కల్పించడం, ప్రకృతిలో మమేకవడం నేర్పించడం కోసమే 'వైల్డ్ లైఫ్ విస్పరర్స్' (జంతువుల భాషను అర్థం చేసుకునే సమూహం) ఏర్పడింది. జంతువులను ప్రేమించడం, రక్షించడం, వాటితో మానవుడి బంధాలు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తుంది. డిజిటల్ యుగంలో ప్రతిదానికీ గూగుల్ మీద ఆధారపడుతున్నాం. ఉన్న ఊరిలో దారి చూపాలన్నా గూగుల్ చూస్తాం. మట్టి వాసన మర్చిపోయి



ఆకాశహర్మ్యాలలో నివశిస్తున్నాం. ప్రకృతే గురువు, అడవి అతిపెద్ద తరగతి గది, అదే అన్నీ నేర్పుతుంది. కాని నేడు ఆ విషయం మర్చిపోయాం. కాంక్రీట్ జంగిల్ మధ్య జీవితం గడుపుతున్నాం. అదే ప్రపంచం అనుకుంటాం. నూతిలో కుప్పలా బతికేస్తున్నాం. బయటకు వచ్చి ప్రకృతిలో గడిపితే అనేక విషయాలు అవగాహనలోకి వస్తాయి. విశ్వం సృష్టి ప్రారంభం అయిన తర్వాత మొదట నీరు, ఆపై భూమి ఏర్పడ్డాయి. ముందు వృక్షజాలం, ఆ తరువాత జంతుజాలం సృష్టించబడ్డాయి. చివరకు మానవుడి ఆవిర్భావం జరిగింది. వృక్షాలు, జంతువులతోపాటు మానవులు జీవిస్తూ వాటిని బతికిస్తూ ప్రకృతి సమతౌల్యం దెబ్బతినకుండా చూడాలి. వాటిని మరచి అడవులను మానవుడు నాశనం చేయడం వల్ల జంతువులు ఊళ్లమీద పడుతున్నాయి. అలా కాకుండా జంతు ప్రేమికుడిగా మారి, వాటి మనసుని, ప్రవర్తన తెలుసుకుంటే ఆ ఆనందం మాటల్లో చెప్పలేం. దానికి ఇష్టంతో పాటు జంతువుల పట్ల సాఫ్ట్‌కార్నర్ ఉండాలి. సాధారణంగా ఖాళీ



దొరికినప్పుడల్లా స్తోమత ఉన్నవారు ప్రపంచపర్యటనకు వెళ్తారు. అదీ దేశాల ప్రధాన నగరాలకు వెళ్తారు. అలా కాకుండా సమయం దొరికినప్పుడల్లా వైల్డ్‌లైఫ్ జాతీయ పార్కులకు వెళితే అక్కడ ఉన్న జంతువులను, వాటి ప్రవర్తన, వేటను, వేట విధానం ప్రత్యక్షంగా చూడవచ్చు. ఆ అనుభూతి వర్ణించలేం. ప్రకృతితో అనుబంధం పెరుగుతుంది. ప్రకృతి, జంతువులకు మాట్లాడే అవకాశం లేకపోయినా జీవనయానంలో ఎదుర్కొనే భయాలు, ప్రమాదాలను అధిగమించడంలో మానవుని కంటే తెలివిగా ఉంటాయి. దానికి అనేక నిదర్శనాలు కనిపిస్తాయి.

మనం ఆధునిక వాహనాల రూపకల్పనలో మోడల్‌గా జంతువుల నుంచే తీసుకుంటున్నాం. బుల్లెట్ రైలు మూతి కింగ్ ఫిషర్ నోటి ఆకారంలా ఉంటుంది. అలాగే ఎయిర్ బస్ ఆకారం ఆల్బ్ట్రాస్ పక్షి ఆకారంలో ఉంటుంది. ఇలా జంతువుల నుంచి, పక్షుల నుంచి అనేక అంశాలు మోడల్‌గా మారుతున్నాయి. కాని వాటికి ఆ గౌరవం ఇవ్వం. సైబేరియన్ పక్షులు రష్యా తీరం నుంచి మన ఏపీలోని నెల్లూరు జిల్లాకు ప్రతి ఏటా వస్తాయి. అలాగే అవి మళ్లీ వాటి ప్రాంతానికి సురక్షితంగా వెళ్తాయి. మరి వాటికి ఈ బాట తెలియడం వాటి తెలివికి నిదర్శనం. అలాగే ప్రకృతిలోని కొన్ని వృక్షాల విత్తనాలు గాలిలో ఎగురుతాయి. అవి అలా ఎగురుతూ పడిన చోట నుంచి పునరుత్పత్తి రూపంలో మొలకెత్తుతాయి. ఇదంతా ప్రకృతి మాయగా భావించాలి. ఇలా ప్రకృతి నుంచి అనేక విషయాలు నేర్చుకోవచ్చు. కంటికి నదురుగా ఉండే రంగులు ప్రకృతి నుంచే గ్రహిస్తాం. వైల్డ్‌లైఫ్ విస్పరర్స్ డిజైన్ వర్క్‌షాప్‌ను నిర్వహించి ప్రకృతి నుంచి పాఠాలు ఎలా నేర్చుకోవాలో కూడా నేర్పుతుంది. ప్రకృతి నుంచి మనకు ఏమి కావాలో, మనం ఏమి ఇవ్వాలో ఈ వర్క్‌షాపు అవగాహన కల్పించడం విశేషం. అమెరికాలో రూజ్‌వెల్ట్ హాయంలో వైల్డ్‌లైఫ్ జాతీయ పార్కుల స్థాపన ప్రారంభమైంది. కెన్యాలోని మసైమారా పార్క్ 7000 అడుగుల ఎత్తులో 1100 చ.కి.మీ.పరిధిలో వ్యాపించి ఉన్నాయి. అక్కడి ఉష్ణోగ్రత సాధారణంగానే ఉంటుంది.

ఇండియాలో నేషనల్ పార్క్‌లు 100కు పైగా ఉన్నాయి. టైగర్‌రిజర్వ్ ఫారెస్ట్‌లు 54 వరకూ ఉన్నాయి. అవి 78వేల చదరపు కిలోమీటర్ల మేర వ్యాపించి ఉన్నాయి. వాటిలో తడోబా (మహారాష్ట్ర), రంతంబోర్ (రాజస్థాన్) ప్రసిద్ధి చెందినవి.

## మచిలీ టైగర్

మచిలీ అనే పులి రాజస్థాన్

వైల్డ్‌లైఫ్ పార్కులో ప్రసిద్ధి చెందినది. దీన్ని చూడడానికి సంవత్సరానికి లక్షమందికి పైగా పర్యాటకులు వస్తుంటారు. ప్రస్తుతం అది చనిపోయింది గాని దాని పిల్లలు ఉన్నాయి. పులివేట విచిత్రంగా ఉంటుంది. పులులు ఒంటరిగా పోరాడతాయి. పులులు మాన్ ఈటర్‌గా ఎందుకు మారతాయనే సందేహం ప్రతివారికి కలుగుతుంది. వాస్తవంగా మనిషి శరీరం ఉప్పగా ఉంటుంది. ఉప్పు శరీరాన్ని పులులు తినవు. కేవలం ఆత్మరక్షణ కోసమే దాడి చేస్తాయి. చంపేసి వదిలేస్తాయి. సింహాలు సమూహంగా కూడా వేటాడతాయి. సింహాలు గాలికి వ్యతిరేకదిశలో వేటాడతాయి. గాలి వీస్తున్న దిశలో అయితే అవతలి జంతువు వాసన పట్టేస్తుంది. అలా ప్రణాళిక వేసుకుని వేటాడడం వాటి ప్రత్యేకత. జింకలు తదితర జంతువులను ముందుగా వాసన పట్టేస్తాయని సింహాలు జాగ్రత్తపడతాయి. ఒక సింహం ఆ జంతువుకు కనిపిస్తుంది. అప్పుడు ఆ జంతువు దానికి వ్యతిరేక దిశగా పరుగెత్తుతుంది. మరో సింహం గడ్డిచాటున దాగి నెమ్మదిగా వచ్చి వేటాడుతుంది. సింహాలు 1.6 మిలియన్ సంవత్సరాల నుంచి ఉన్నాయి. సింహాలు పిల్ల సింహాలకు వేటను నేర్పిస్తాయి. కాని అవి ఆహారం కోసం చేసే వేటలో ఇతర జంతువులను చంపుతాయి. కాని పిల్లలకు వేటనేర్పే క్రమంలో ఆయా జంతువులను గాయపరుస్తాయి తప్ప చంపవు. ఇవన్నీ జంతు ప్రేమికులు వాటి ప్రవర్తన పరిశీలిస్తే అవగతమవుతుంది. చీమ 97 మిలియన్ సంవత్సరాలుగా సంచరిస్తున్నది. చీమలో ఏడు రకాలు ఉన్నాయి. వాటిలో సేవక చీమ, సైనిక చీమ, గార్డ్ చీమ, రాణి చీమ అలా పని విభజన మేరకు ఉంటాయి. చీమ తన ఆహారం



తెచ్చుకునే ప్రయత్నంలో ఎప్పుడూ దగ్గర దారినే ఎన్నుకుంటుంది. ఏనుగులు 50 మిలియన్ల ఏళ్లుగా భూమి మీద నివసిస్తున్నాయి. ఏనుగు 100 ఏళ్ల బతుకుతుంది. 10.కి.మీ ముందే నీటి సౌకర్యాన్ని గుర్తిస్తుంది. వాటికి 10వేల సంవత్సరాల నాటి తెలివి ఉంటుంది. ఏనుగు తన పిల్లలకు ఆటల రూపంలో తనను తాను ఏలా కాపాడుకోవాలో నేర్పిస్తుంది. అడవి పందికి జ్ఞాపకశక్తి ఉండదు.

అది తనను వేటాడే జంతువును తప్పించుకునే ప్రయత్నంలో ఎక్కడ బయలుదేరిందో అక్కడికి చేరుతుంది. ఇవన్నీ జంతువుల ప్రవర్తన తెలుసుకోవాలన్న ఇష్టం, కుతూహలం ఉంటే తెలుస్తుంది. మానవుడు కేవలం మూడులక్షల సంవత్సరాల క్రితమే ఆవిర్భవించాడు. కాని మానవుడికి ఉన్న జ్ఞానం మరే జంతువుకీ లేదు. కాని జంతువులకు ఉన్న తెలివి, వాటి జీవనం, వేట, నాయకత్వ లక్షణాలు తెలుసుకోవడం ఒకరకంగా వాటి పట్ల మనకు ఇష్టం కలుగుతుంది. ప్రకృతితో సంబంధాలు పెరిగి పర్యావరణంపై అవగాహన పెరుగుతుంది. ప్రకృతే మన జీవన విధానంగా మారుతుంది.



**(4వ పేజీ తరువాయి)**

ఎఫ్ఓఎంఒ (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్-తప్పిపోతుందనే భయం) టిబిటీ (త్రోబ్యాక్ థర్స్‌డే), ఓఎంజి (ఒమైగాడ్-ఓరీ దేవుడా), జి8టి గ్రేట్, ఎల్8ఆర్ (లాటర్ లేదా సీ యూ లాటర్-తర్వాత), టిటివైఎల్ (టాక్ టు యు లాటర్-మీతో తర్వాత మాట్లాడుతా), బిఆర్‌బి (బిరైట్ బ్యాక్- వెనక్కి ఉండండి), బిటిహెచ్ (టుబి ట్రూత్‌పుట్)-నిజాయితీగా ఉండడం)లాంటి సంక్షిప్త ఆంగ్లపదాలు సామాన్యుల సన్నిధికి చేరాయి. నేడు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో 'ఎయిర్‌పంచ్' (విజయానికి చిహ్నంగా పిడికిలా బిగించి గాల్లోకి పంచ్ చేయడం), 'బాలర్' (ఆకర్షణీయమైన), 'క్రే' (క్రేజీగా), 'తోషేడ్' (పబ్లిక్‌లో విమర్శించడం), 'అమేజ్‌బాల్' (అద్భుతమైన), 'స్ప్రిట్‌టెక్' (ఆకస్మికంగా ధనాన్ని ఉమ్మి వేయడం), 'బింజ్‌వాచ్' (ఒకేసారి అనేక అంకాల సీరియల్ చూడడం), 'టెక్-సావీ' (ఆధునిక టెక్నాలజీని ఒంటపట్టించుకోవడం), స్పీడ్‌ఫ్రీక్స్ (పెరుగుతున్న కమ్యూనికేషన్ రేటు) లాంటి ఆంగ్లపదాలు చేరిపోయాయి.

**సోషల్ మీడియా ప్రభావంతో కొత్త ఆంగ్లభాషా పదాల జననం వరమా, శాపమా?**

సామాజిక మాధ్యమాల కోసం రాస్తున్న లింగో, సంక్షిప్తాలు, సాధారణ సూచనలు, సాంస్కృతిక ప్రభావాలుకూడా నిరంతరం అభివృద్ధి చెందడంతో కంటెంట్‌ను అందరు అర్థం చేసుకోవడం ఇబ్బందిగా ఉంటుండంతో తప్పుగా కూడా అర్థం లేదా అపార్థం చేసుకోవడం జరగవచ్చని తెలుస్తున్నది. వ్యాకరణ నియమాలకు తిలోదకాలివ్వడం, స్పష్టత కొరవడడం, అధికారిక స్వరం లేకపోవడం, పరిమిత పదజాలం వాడడంతో సోషల్ మీడియా భాషకు హాని కలుగుతున్నట్లు ఆంగ్లభాషా నిపుణులు వాపోతున్నారు.



సోషల్‌మీడియా ప్రభావంతో ఆంగ్లభాషలో చేరుతున్న కొత్త పదాలు లేదా పదబందాలు భాషోన్నతికి వరంగా, కొన్ని సందర్భాల్లో శాపంగా కూడా మారుతున్నట్లు భాషా నిపుణులు వారి వారి వాదనలు వినిపిస్తున్నారు.

కథ

# లేడీస్ గ్రేట్

బొందల నాగేశ్వరరావు

**"క్రిష్! నేను రేపు సాయంత్రానికల్లా వచ్చేస్తాను. ఎలాగోలా ఇవాళ, రేపు పిల్లలిద్దర్ని బడికి పంపించు. చంటిదానికి స్నానం చేయించి తుడిచి పౌడరు పూసి బట్టలు తొడిగి పాలు పట్టించు" అంది ఆటోలో కూర్చొని భార్య పూజ.**

"నువ్వెళ్లవే! ఇదిగో.. నా ఆఫీసులో మేనేజరు హోదాతో కంప్యూటరు ముందు కూర్చొని పాతిక మందిని సంభాళించేవాడ్ని. ఈ పని నాకేమాత్రం? అనారోగ్యంతో బాధపడుతున్న మీ నాన్నను చూసుకొని రేపు రాత్రికల్లా వచ్చేయ్. నేను కూడా పిల్లల సంరక్షణంటూ రోజూ నువ్వు చేస్తున్న డ్రామాలేమిటోనన్నది ఈ రెండు రోజుల్లో తేల్చుకుంటాను" అన్నాడు వ్యంగ్యంగా క్రిష్.

ఫక్కున నవ్వింది పూజ. "అలాగా! అంటే నేను రోజూ పిల్లలతో వేగుతోంది డ్రామాలా? అయితే ఆ డ్రామాలేమిటో మీకూ తెలుస్తాయిలే!" అని అంటుండగా ఆటో కదిలింది.

రెండు, నాలుగు క్లాసులు చదువుతున్న రష్మి, తన్విలిద్దరూ తల్లికి టాటా చెపుతుంటే క్రిష్ చంకలో వున్న సంవత్సరం చంటిది ఆటో వెళుతున్న వేపే చూస్తూ వుంది.

క్రిష్, పూజ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు.

అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని చూడాలని పూజ పుట్టింటికి వెళ్లటంతో భర్త క్రిష్‌కు రెండు రోజుల పాటు పిల్లలను చూసుకోవటం తప్పనిసరైంది.



పూజ ఊరికి బయలుదేరక మునుపే స్నానాపానాదులను ముగించుకొని యూనిఫాం వేసుకొని తయారై వున్న పెద్ద పిల్లలిద్దరూ వరాండాలో వున్న బెంచీలో కూర్చొని స్కూలు వ్యాను కోసం ఎదురుచూస్తూ వున్నారు.

ఈలోపు చంటిదాన్ని ఊయలలో వేసి కిచన్‌లోకి వెళ్లి పాలను కలుపుకొని ఫీడింగ్ బాటిల్‌లో పోసి తెచ్చి చంటిదాని నోటికి అందించాడు చంటిది ఆమ్.. ఆమ్ అంటూ పాలు తాగుతుండగా స్కూలు వ్యానొచ్చి ఆగింది.

పెద్ద పిల్లలిద్దరి భుజాలకు బ్యాగులను తగించి వ్యానెక్కించాడు క్రిష్. గబగబ చంటిదాని వద్దకెళ్లి చూశాడు. నిమిషాల్లో పాలను తాగిన చంటిది నిద్రలోకి జారుకుంది. ఫీడింగ్ బాటిల్‌ను పక్కకు తీసి గుడ్డతో నోటిని తుడిచి "ఓష్! ఈ మాత్రానికే ఎంత బిల్డప్ ఇస్తుందో ఈ ఆడది" అనుకొంటూ అక్కడే వున్న సోఫాలో కూర్చున్నాడు క్రిష్ ల్యాప్‌టాప్‌ను ముందేసుకొని. ఆ రోజు అలా ఈజీగా గడిచిపోయింది.

మరుసటి రోజు ఉదయం ఆరు గంటలకల్లా అలారానికి బదులు ఉయ్యాల్లో వున్న చంటిదాని ఏడుపు క్రిష్‌ను నిద్ర లేపింది. నిద్ర నుంచి మేల్కొన్న తను చంటిదాని వేపు చూశాడు. అప్పటికే ఊయలలో ఒకటికీ, రెంటికి వెళ్లిన చంటిది డైపర్ లేని కారణాన అది కాస్తా వొంటికి పూసుకొని రోతగా కనబడింది క్రిష్‌కు. వెంటనే బాత్ రూంకు తీసుకెళ్లి శుభ్రం చేసి తుడచి కొత్త డైపర్, గౌనుతో పడుకోబెట్టి పాలసీసాలను నోటికందించాడు. అవతలి గదిలో వున్న పెద్ద పిల్లల్ని లేపి "మీరు ముఖం కడుక్కొని వచ్చి హోం వర్కు చేసుకొని చదువుకోండి. ఈలోపు పాలు తెస్తాను" అంటూ స్కూలు బాగుల్ని వాళ్ల ముందుంచి కిచెన్‌లోకి వెళ్లాడు క్రిష్. తనకు కాఫీ పెట్టుకొని తాగి పిల్లలకు పాలు తీసుకొని గదిలోకి వెళ్లి చూస్తే అక్కా చెల్లెళ్లిద్దరూ టెక్ట్స్ బుక్స్ ముందుంచుకొని పెన్సిళ్లు, ఎరేజర్లను ఒకరి మీద ఒకరు విసురుకొంటూ, నవ్వుకొంటూ ఆడుకొంటున్నారు.

"చూడండీ! మిమ్మల్ని గమనిస్తూ నేనిక్కడ కూర్చోలేను. వంట చెయ్యాలి. చక్కగా పాలు తాగి, కాస్సేపు చదువుకొని ఎనిమిదిన్నరకల్లా యూనిఫాం వేసుకొని రడీగా వుండాలి. జీడిపప్పు ఉప్మా చేస్తాను తిని, వ్యానెక్కి బడికి వెళ్లాలి, తెలిసిందా? మీ అమ్మలా మీకు స్నానాలు చేయించి, వొళ్లు తుడిచి, యూనిఫామ్ తొడిగి, తల దువ్వి, జడలు అల్లి, పౌడరు పూసి బడికి పంపే ఓపిక నాకు లేదు. మీరు పెద్ద పిల్లలు కదా. అందుకే వీలైనంత వరకు మీరే రెడీ కండి!" అంటూ మళ్లీ కిచెన్‌లోకి వెళ్లిపోయాడు క్రిష్.

పొయ్యి వెలిగించి బాండ్లీని స్టవ్ మీద పెట్టి మంచి నూనెను అందులో పోసి, మొదటే తరిగి వుంచిన ఉల్లిపాయను వేసి కాస్త వేగిన తరువాత ఆవాలు, జీలకర్ర, మినపప్పుతో పాటు జీడిపప్పును కూడా వేసి ఫెళఫెళమని వేగిన వెంటనే నీళ్లు పోసి అవి తెర్లిన తరువాత తగినంత రవ్వ అందులో వేసి అటూ ఇటూ తిప్పి "ఉప్మా రెడీ" అంటూ సంతోషపడ్డాడు క్రిష్.

అంతలో పక్కనున్న పొయ్యి మీది కుక్కర్ మూడవ విజిల్ వేసింది. స్టవ్ ఆఫ్ చేసి రెండు ప్లేట్లలో ఉప్మా వుంచుకొని తెచ్చి పిల్లల ముందుంచాడు.

పిల్లలు స్పూన్లతో ఉప్మా తింటున్నారు.

"ఒకే! త్వరగా తిని, తయారుకండి" అంటూ మళ్లీ కిచెన్‌లోకి వెళ్లిన క్రిష్ పెరుగు తాలింపుతో అన్నాన్ని కలిపి ఆవకాయతో బాక్సుల్లో పెట్టుకొని తెచ్చి బాక్సుల్లో వుంచాడు.

పిల్లల్ని అలా చూసి "ఏమిటీ? స్నానం చేసొచ్చి అలా నిలుచున్నారు? యూనిఫాం వేసుకోరా?" ప్రశ్నించాడు క్రిష్.

పిల్లలిద్దరూ మౌనంగా వున్నారు.

"కర్మ..కర్మ" అనుకొంటూ వెళ్లి బీరువాలోని యూనిఫామ్స్ తెస్తుండగా ఉయ్యాల్లో వున్న చిన్నది లేచి 'కేర్' మంటూ ఏడుపు లంకించుకొంది. యూనిఫామ్‌ను సోఫాలో పడేసి ఊయల వద్దకు వెళ్లి చూశాడు. చంటిది ఒకటో బాత్రూంకు వెళ్లినట్టుంది.. డైపర్ నిండుకుంది. దాన్ని తీసి తుడిచి కొత్త డైపర్ వేసి పాలసీసా నోటికి తగిలించి పెద్ద పిల్లలిద్దరికీ యూనిఫాం తొడిగి, తలలు దువ్వి, జడలు వేసి, పౌడరు పూసి బొట్టు పెట్టి బ్యాగుల్ని భుజాలకు తగించి బయట అరుగు మీద కూర్చోపెట్టాడు.

స్కూలు వ్యానొచ్చింది.

"హమ్మయ్య.." అనుకొంటూ పిల్లలను అందులోకి ఎక్కించాడు క్రిష్.

వ్యాను కదిలిపోయింది.

పాపం.. క్రిష్! ప్రతిరోజూ ఎనిమిది గంటలకు లేచి కాఫీ తాగి పేపరు చదివి తరువాత దబాయింపు ధోరణితో భార్యను భయపెడుతూ పనులు చేయించుకునేవాడు. చివరికి షూకి పాలీష్ కూడా భార్య చేత చేయించుకునేవాడు.

అలాంటి క్రిష్ ఇవాళ ఉదయం ఆరు గంటలకే లేచి పనులన్నిటిని చేసుకొంటూ పిల్లలతో వేగుతోంది జన్మజన్మలకు గుర్తుండిపోయే సన్నివేశమనుకున్నాడు.

ఆరోజు వంట, ఇంటి పనులతో బాగా అలసిపోయిన క్రిష్ అలాగే వెళ్లి సోఫాలో మేను వాల్చి కళ్లు మూసుకున్నాడు.

అంతే! వున్నట్టుండి ఎవరో పిలిచినట్టు దిగ్గున లేచి గడియారం వంక చూశాడు. అప్పుడు గంట సరిగ్గా మధ్యాహ్నం మూడు. వెంటనే లేచి చల్లటి నీళ్లతో ముఖం కడుక్కొని ఆఫీసుకు ఫోన్ చేసి ఓ రోజు సెలవు తీసుకున్నాడు. బాండ్లీని హాల్లోకి తెచ్చుకొని అందులో మిగిలిన వున్న ఉప్మాను ఆవురావురంటూ తిని చేయి కడుక్కొని తీరుబడిగా తన భార్యను.. కాదు.. కాదు ప్రతి ఇంట్లో భార్య స్థానంలో వుండే సాధారణ గృహిణుల గురించి ఆలోచించసాగాడు. నిజం చెప్పాలంటే పాపం.. ఆడవాళ్లు ఉదయం లేచిన దగ్గర నుంచి పడుకోబోయే వరకు బోలెడు ఇంటి, వంట పనులతో సతమతమై బాగా అలసిపోతారని అప్పుడు తెలుసుకొన్నాడు. ఇక ఉద్యోగాలు చేసే గృహిణులైతే వాళ్లు ఇంటి, వంట పనులతో పాటు వుద్యోగాలు చేయటమే కాక అన్ని విధాలా భర్త అవసరాలను తీర్చే యంత్రాలనుకున్నాడు క్రిష్. అలాంటి స్త్రీలపై కాస్త సానుభూతి, జాలిని తెచ్చుకొని తనకు తానే మనసులో చిన్నగా బాధపడ్డాడు.

అంతలో గంట నాలుగున్నర అయింది. బడిపిల్లల వ్యానొచ్చి ఇంటి ముందాగింది.

క్రిష్ పరిగెత్తినట్టు వెళ్లి పిల్లలిద్దర్ని దించి స్కూలు బ్యాగుల్ని తీసుకొని ఇంట్లోకి నడిచాడు. అప్పుడు క్రిష్‌కు

**"తల్లీ! ఇద్దరూ వినండి. పాలు తాగిన తరువాత ఓ గంటసేపు ఆడుకోండి. తరువాత హోం వర్కు చేసుకొని కాస్సేపు చదువుకోండి. ఈలోపు మనకూ, మమ్మీకి ఆలూకూరతో చపాతి చేసిపెడతాను.. సరేనా?" అన్నాడు క్రిష్. "మమ్మీ వస్తుందా నాన్నా?" పెద్ద పిల్ల అడిగింది.**

ఈవెనింగ్ తతంగం మొదలైంది.

పిల్లలు ముఖం కడుక్కొని వచ్చేసరికి స్నాక్సు, హార్లిక్సుతో కలిపిన పాలను తీసుకెళ్లి టీపాయ్ మీదుంచాడు.

"తల్లీ! ఇద్దరూ వినండి. పాలు తాగిన తరువాత ఓ గంటసేపు ఆడుకోండి. తరువాత హోం వర్కు చేసుకొని కాస్సే పు చదువుకోండి. ఈలోపు మనకూ, మమ్మీకి ఆలూకూరతో చపాతి చేసిపెడతాను.. సరేనా?" అన్నాడు క్రిష్.

"మమ్మీ వస్తుందా నాన్నా?" పెద్ద పిల్ల అడిగింది.

"అవునమ్మా! మరో రెండు గంటల్లో దిగిపోతుంది" అంటుండగా ఉయ్యాల్లో చిన్నది లేచింది. క్రిష్ గబగబా వెళ్లి తయారుగా వుంచిన పాలసీసాను నోటికందించాడు. చిన్నది ఆమ్.. ఆమ్మని పాలు తాగుతుంటే "పాలు తాగి గోల చేయకుండా హాయిగా పడుకోవాలి. నాన్నకు బోలెడు పనులున్నాయమ్మా" అంటూ బుగ్గను చిదిమి ముద్దు పెట్టుకొని కిచెన్‌లోకి వెళ్లిపోయాడు క్రిష్.

ఒక్క గంటలో చపాతి, ఆలూకూర చేశాడు. అంతలో పెద్ద పిల్లలు చదవటం ముగించారు. ఇద్దరికీ స్నానాలు చేయించి, వొళ్లు తుడిచి బట్టలు తొడిగి తల దువ్వి పౌడరు పూసి ఎంచక్కా బొమ్మల్లా తయారు చేసి, సోఫాలో కూర్చోపెట్టాడు. తనూ స్నానమదీ చేసి టీ షర్టు, షార్టుతో తయారై వచ్చి సోఫాలో కూర్చున్నాడు. అప్పుడు గంట ఎనిమిది.

ఆటో వచ్చి ఇంటి ముందాగింది. అందులో నుంచి పూజ దిగింది. అది గమనించిన పిల్లలిద్దరూ "అమ్మ వచ్చేసిందోచ్" అంటూ ఎదురు వెళ్లారు.

పిల్లలతో పాటు పూజ లోపలికి వచ్చింది.

"ఏమిటి మహానుభావా? అలా దిగాలుపబడి కూర్చున్నారు. ఒక్క రోజుతో అయిపోయిందా తమరిపని" అడిగింది పెదాల పైకి నవ్వు తెచ్చుకొని పూజ.

చటుక్కున పూజను లాగి పక్కన కూర్చోపెట్టుకున్న క్రిష్ "నిజంగా మీ ఆడవాళ్లు ఎంత గొప్పవాళ్లో! ఇంట్లో ఇన్ని పనులు చేసుకొంటూ ఓర్పు, సహనాలతో ఇంటిల్లిపాదిని చక్కగా సంభాళిస్తూ సంసారాన్ని నెట్టుకొస్తున్నారని ఇవాళే తెలుసుకున్నాను. ఇక.. ఇన్ని పనులను చేసుకొంటూ సంపాదన కోసం ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలనైతే ఎంతగా అభినందించాలో! అందుకే నా మటుకు నేను మీలాంటి వారికి చేతులెత్తి నమస్కరిస్తాను. రియల్లీ లేడీస్ ఆర్ వెరీ గ్రేట్! ఇంతకూ మీ నాన్నకెలా వుంది?" అడిగాడు.

"ఇప్పుడు పర్వాలేదండి. బాగున్నారు. సరే! రాత్రి డిన్నర్‌కు ఏం చేశారు?" అడిగింది పూజ.

"నీకు బాగా ఇష్టమని చపాతి, ఆలూకూర చేశాను డియర్" అన్నాడు క్రిష్.

"వెరీగుడ్! అయిదు నిమిషాల్లో వడ్డించేస్తాను" అని లేవబోయింది పూజ.

"నో.... వంట చేసింది నేను. మీకు వడ్డించేది కూడా నేనే సుమా!" అంటూ క్రిష్ కిచెన్‌లోకి వెళుతుంటే భర్తను చూస్తూ మెల్లగా నవ్వింది పూజ.

తల్లి నవ్వుతో నవ్వు కలిపారు పిల్లలిద్దరూ.

సాహిత్యం

# తెలుగు మణిహారం

జయసూర్య

భారతదేశంలో దేశ భాషలలో పేర్లు, ఆయా రాష్ట్రం లేదా ప్రాంతాల పేర్లు చూస్తే ఒక్క తెలుగు మాత్రం భిన్నంగా వుంది. మహారాష్ట్ర, తమిళనాడు, కన్నడ, అస్సాం, పంజాబు, బెంగాల్ రాష్ట్రాలు- మరాఠీ, తమిళం, కన్నడ, అస్సామీ, పంజాబీ, బెంగాలీ భాషల పేర్లు కలిగి వుంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గురించి చెప్పేటప్పుడు తెలుగువారనే అంటున్నాం.

ఆంధ్ర, తెలుగు శబ్దాలకు సంబంధం లేదు. తెలుగువారు భాష మాట్లాడుకొనే ప్రదేశాన్ని మొదట ఆంధ్రులు ఆక్రమించుకోవడం వలన తెలుగుకు ఆంధ్రానికి బాంధవ్యం కలిగివుంది. అంతే.

ఆంధ్ర శబ్దం సంస్కృతంలో దేశ, జాతి, వాచకంగానే వుంది. దీనికి ఆంధ్రః, ఆంధ్రీ, ఆంధ్రమ్ అనే రూపాలున్నాయి. ఆంధ్రం ఒక సంస్కృత పదం. అది తత్సమం. తెలుగు భాషా పరిణామ దశలో చివరి దశగా తత్సమాలు తెలుగు భాషలో ప్రవేశించాయి. తద్భవాలు ఏర్పడే నాటికి 'ఆంధ్ర' శబ్దం తెలుగులో వాడుకలో లేదని భావించవచ్చు. తెలుగు భాషా పరిణామాన్ని అచ్చతెలుగు, దేశి తెలుగు, తద్భవాలు, తత్సమాలుగా విభజింపవచ్చు. ఈ భాషా పరిణామ దృష్టితో తెలుగుకు వున్న పేర్లు తెనుగు, తెలుగు, ఆంధ్రం మూడు పదాలు మన భాషకున్నాయి. తెనుగు, తెలుగు అచ్చతెలుగు పదాలు. పైగా యివి దేశ్య పదాలు. ఆంధ్రం అనే పదం సంస్కృతం. దేశ జాతి వాచకంగా తెనుగు, భాషా వాచకంగా నిలిచిపోయింది. తత్సమమైన ఆంధ్ర శబ్దం కంటే దేశి యైన తెనుగుకు ఎంతో పూర్వ చరిత్ర వుంది. ఆంధ్ర రాజులు పాలిత ప్రజల భాష యైన తెలుగును వాడేవారు. ఆనాడు దేశం ఆంధ్రం, దేశ ప్రజలు మాట్లాడే భాష తెలుగు కావడంతో తెలుగు భాషకు ఆంధ్రమనే పేరు రాలేదు. 'ఆంధ్ర' శబ్దం ఐతరేయ బ్రాహ్మణంలో ఉంది. కానీ ఆంధ్ర రాజులు ఆక్రమించిన ప్రదేశంలో తెలుగువారు నివసిస్తున్న కాలం అది. కనుక ఆంధ్రుల కన్నా తెలుగువారే పెక్కునాడులలో నివసించడంచేత భాష ఒకటి అయినా 'తెలుగునాడు' అనే ఏకైక పేరు ఆ దేశానికి రాలేదు. ఆంధ్ర రాజులు ఈ నాడులన్నింటినీ పరిపాలించిన కారణంగా దేశానికి 'ఆంధ్ర' నామం వచ్చి తదనంతరం ఆంధ్రప్రదేశ్‌గా ఆవిర్భవించింది.

ప్రస్తుతం మన మాతృభాష తెలుగు రెండు రాష్ట్రాలలో విలసిల్లుతోంది.

## దేశ భాషలందు తెలుగు లెస్స

తెలుగు భాషా సాహిత్య ప్రశంసలలో పై సూక్తి అర్థం దేశ భాషలలో తెలుగు శ్రేష్ఠమైనదని పొగడటం. కానీ అంతగా శ్రేష్ఠత్వం ఏ దశలో ఎలా కలిగినదీ నిరూపితం కావలసి వుంది. ఇక్కడ తెలుగంటే అచ్చతెనుగు అనే అర్థం కాదు. అలా అయితే కర్ణాటక సార్వభౌముని రోజులలో అది దేశ భాషలలో శ్రేష్ఠమని చెప్పుకోవటానికి అవకాశమే లేదు. సంస్కృత పదాలు తత్సమాలుగా అచ్చతెనుగులో చేరిన తరువాతనే తెలుగు భాషా పరిణామం పూర్తి అయి అది కావ్య రచనకు అనుకూలమైంది. కావ్య భాషగానే కాదు తెలుగువారి నిత్య వ్యవహారాలలో కూడా సంస్కృత పదాల వాడుకతో రెండింటికీ విడదీయరాని అనుబంధం ఏర్పడింది. సంస్కృతం లేకపోతే తెలుగు లేదనే స్థిరీకరించబడింది. సంస్కృతానికి జీవం అందించింది.



సంస్కృత భాషతో కలిసిన తెలుగు లెస్స అయింది. నాటి అచ్చతెనుగు, సంస్కృత భాషా ప్రౌఢిమ, మధురమైన దేశి నుడికారం, మధుర స్వర, వర్ణ సంగీత సాహిత్య సమ్మేళనంగా తెలుగు అవతరించింది. భారతీయ దేశ భాషలలో తెలుగు సంస్కృత కలయిక చందోబద్ధంగా మిళితమై భాషలలో మిన్న అయింది. తెనుగు, సంస్కృతం విడివిడిగా కనపడుతూ ఒకే వాక్యార్థాన్ని సమన్వయించిన రచనను 'మణి ప్రవాళం' అంటారు. మణులు, ప్రవాళములు అంటే పగడాలు కలిపి ఒకే దారంతో గుచ్చినట్లయితే తెలుగు, సంస్కృత పద స్వరూపంగా ఏర్పడిన రచన మణి ప్రవాళం.

అంతేకాదు, యావద్భారత దేశంలో అధిక సంఖ్యాకుల జాతీయ భాష స్థాయి పొందిన తెలుగు నిత్య వ్యవహారంలో సంస్కృతాన్ని అద్భుతంగా మిళితం చేసుకొన్న దేశీయ భాషలలో అగ్ర స్థానం పొందగలిగింది. ఆ విధంగా సంస్కృతాన్ని సజీవంగా భాసింపచేసింది.

భిన్నత్వంలో ఏకత్వం సాధించిన తెలుగు ఎంతటి విలక్షణ తత్త్వంగల భాషలనైనా తనలో ఇముడ్చుకొనే శక్తివంతమైన భాషగా జాతీయ స్థాయిలో వాచ్యభాష అయిన ఉత్తరాది హిందీ కంటే ప్రామాణికంగా గుర్తింపు పొందగలిగింది.

ఈ రీతిగా భాషా సమైక్యత ద్వారా జాతీయ సమైక్యతకు నాంది పలికింది. కానీ దక్షిణాది భాషగా నిరాదరణ తప్పలేదు.

తెలంగాణాలో కన్నడ ఆదికవి పంపన కాలంనాటి ప్రాచీనతా వెన్నెల వెలుగులు కారణంగా ప్రాచీనతా గుర్తింపు పొందగలిగింది. వినుకొండ వల్లభరాయుని ఒక వీధి నాటకం క్రీడాభిరామంలో ఒక పద్యం ఇలా ఉంది.

**"జనని సంస్కృతంబు సకల భాషలకును**
**దేశ భాషలందు తెలుగు లెస్స**
**జగతి, తల్లికంటే సౌభాగ్య సంపద**
**మెచ్చునాడు, బిడ్డ మేలుగాదె"**

గానట బీసట చదివి గాథలు తవ్వుకొనే తెలుగు, తెలింగానము అంటే తెలుగు మాట్లాడే ఆనము(ప్రాంతం)గా జగమేలిన చరిత్ర సృష్టించుకొంది. 1824 నవంబరు 23న బ్రౌన్‌దొర రాసిన వేమన పద్యాల ఆంగ్లానువాద గ్రంథానికి పీఠికలో 'తెలంగాణ' మాత్రమే సి.పి.బ్రౌన్ పేర్కొన్నారు. ఏది ఏమైనా మన మాతృభాష మన తెలుగు, జాతీయ, అంతర్జాతీయ భాషగా విజయ కేతనం ఎగురవేయాలి.

# డబ్బు ఎంత పనైనా చేస్తుంది!

యామిజాల జగదీశ్

డబ్బు అనేది నాకు ఒక్కో ప్రాయంతో వేర్వేరు అర్థాలిచ్చింది. స్కూల్లో చదువుతున్నప్పుడు మధ్యాహ్నం అన్నం తినడానికి ఇంటికి వెళ్లడం వల్ల బామ్మ డబ్బుని చూపించేది కాదు. అసలా ప్రస్తావన తెచ్చేది కాదు. అయితే ఎప్పుడైనా రెండణాలిచ్చి చాక్లెట్ కొనుక్కుని తినమని చెప్పేది. అప్పట్లో రెండణాలతో రంగరాజా టెంట్ హౌస్‌లో నేల టిక్కెట్ కొనుక్కుని సినిమా చూడొచ్చు.

బామ్మకు ఓ బ్యాంకులో ఖాతా ఉండేది. అందులో కాస్త డబ్బుండేది. ఎప్పుడైనా ఓ ఇరవై అయిదు రూపాయలు తీసుకురమ్మనమని చెప్పేది. వణికే వేళ్లతో ఇరవై అయిదు సార్లు లెక్కపెట్టి ఇస్తారక్కడ.

బ్యాంకుని దోచుకోవడానికి వచ్చిన వాడిలా చూసేవారు నన్ను.

తిరుచ్చీ సెయింట్ జోసెఫ్ కాలేజీలో చదివినప్పుడు శ్రీరంగం నుంచి తిరుచ్చీ టౌనుకి వచ్చి మూడు నెలలకు ఓ పసుపు రంగు పాస్ ఒకటి కొనిచ్చేది. దాంతో లాల్గుడి ప్యాసింజరులో ప్రయాణం చేసి కాలేజీకి వెళ్లేవాడిని. మధ్యాహ్నం హోటల్లో అన్నం తినడానికి రెండణాలు ఇచ్చేది. పెనిన్సులర్ హోటల్లో ఓ దోసె రెండణాలు. కొన్ని సార్లు దోసెను కాకుండా ఇండియా కాఫీ హౌసులో కాఫీ తాగేవాడిని. ఐస్ క్రీం వంటివన్నీ కలగనడమే.

ఎంఐటీ(మద్రాసు)లో చదువుతున్నప్పుడు నాన్న హాస్టల్ మెస్ బిల్లు కట్టి నా సబ్బు, దువ్వెన వంటి ఖర్చులకు ఇరవై అయిదు రూపాయలు ఇచ్చేవారు. బడ్డీకొట్టు అయ్యర్ దుకాణంలోనూ, క్రోంపేట్ రైల్వే స్టేషన్ దుకాణంలోనూ ఎప్పుడూ అప్పే. ఆ అప్పు ఎప్పుడు తీర్చానో గుర్తు లేదు.

ఇంజినీరింగ్ చదువు పూర్తి చేసి ఆల్ ఇండియా రేడియోలో ట్రైనింగ్ అప్పుడు స్టైఫండ్‌గా నూట యాభై రూపాయలు ఇచ్చేవారు. అదొక కలలా అనిపించేది. ఎందుకంటే అప్పటివరకూ నేనంత డబ్బు చూడలేదు.

సౌత్ ఇండియా బోర్డింగ్ హౌస్‌లో అన్నానికి ఖర్చు డెబ్బయి అయిదు రూపాయలు. మిగిలిన డెబ్బయి అయిదు రూపాయలు ఎలా ఖర్చు చేయాలో తెలియక ఉక్కిరిబిక్కిరి అయ్యేవాడిని. ఉలెన్ స్వెట్టర్, బోలెడన్ని పుస్తకాలు కొనేవాడిని. నెల చివర్లో రూపాయో.. రెండు రూపాయలో మిగిలేవి.

ఆ తర్వాత ఉద్యోగం దొరికింది. 1959లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం. నెల జీతం 275 రూపాయలు. నాన్నకు ఓ ట్రాన్సిస్టర్ కొనిచ్చాను. అమ్మేమో తనకేదీ అక్కర్లేదంది. ఓ మాండొలిన్ కొని రాత్రీ, పగలూ సాధన చేసేవాడిని. ఇంట్లో ఆంప్లిఫ్లయర్, రికార్డ్ ప్లేయర్ వంటివన్నీ పెట్టి నానా హంగామా చేసేవాడిని. పాపం.. అమ్మ ఆ గోలంతా భరించింది.

పి.ఎస్.సి.పరీక్ష రాసి ఢిల్లీకి టెక్నికల్ ఆఫీసరుగా వచ్చాను. రూ.400/- జీతం. నా పేరుతో ఐఒబీలో ఓ అకౌంట్ ప్రారంభించాను. పుస్తకాలు, వెస్పా స్కూటరుకి అలాట్మెంట్ అయినప్పుడు ప్రపంచంలో అగ్రస్థానాన్ని తాకినట్లు అనిపించింది.



అనంతరం భారత్ ఎలక్ట్రానిక్స్‌లో డెప్యూటీ మేనేజరుగా చేరినప్పుడు జీతం మొదటిసారిగా నాలుగు అంకెలకు చేరింది. బెంగళూరుకి బదిలీ అయింది. సెకండ్ హ్యాండులో నల్ల అంబాసిడరు కారు, పెళ్లి.

అయితే నా దగ్గర ఓ అలవాటు ఉండేది. ఓ స్థాయికి మించి డబ్బు కూడబెట్టేవాడిని కాను. అంతకన్నా ఉండేది కూడా కాదు. ఎప్పుడూ అవసరానికి కాస్తంత డబ్బు తక్కువగానే ఉండేది. ఇందులో ఓ సౌకర్యం ఉండేది.

ఎవరైనా వచ్చి "పెద్ద అప్పు" అడిగితే జేబు, బ్యాంకు పుస్తకం చూపించి ఇవ్వడానికేమీ లేదనొచ్చు. ఓ చిన్నపాటి సూచన.. ఎక్కువ డబ్బు కూడబెట్టకండి. హింస, ఇబ్బంది, తలనొప్పి. ఈరోజు చాలా మందికి నా పట్ల అనుమానమే.

సినిమాలకు కథలు రాసిస్తుంటావు. వాళ్లు రెండు చేతుల నిండా డబ్బులిస్తారు కదా. పుస్తకాల నుంచీ పత్రికల నుంచి డబ్బులు వస్తుంటాయి కదా. అంత డబ్బు పెట్టకుని ఏం చేస్తావని?

నా అనుభవంలో మాట.. అనుకున్న దానికన్నా ఎక్కువ డబ్బు కూడబెడితే అంతకు మించిన భారీ ఖర్చు మన మీద వచ్చి తీరుతుంది. అది ప్రకృతి ధర్మం. ఆ ఖర్చు వైద్యానికి కావచ్చు. లేదా ఇల్లు, కారు ఏదో ఒకటి కొనడానికి బ్యాంకులో అప్పు తీసుకోవచ్చు. ఇందుమూలంగా ముఖ్యంగా నేను తెలుసుకున్నది ఖర్చు చేస్తుంటేనే డబ్బు వస్తుందన్న విషయం.

ఈరోజు చాలా మందికి నా డబ్బు గురించి ఎక్కువ అంచనాలు ఉండొచ్చు. కానీ నిజం ఇదే.

ఈరోజుకి అప్పంటూ ఏదీ లేదు. నా దగ్గరున్న డబ్బులో అడ్డదారిలో ఉన్నదేదీ లేదు. కనుక రాత్రి పడుకుంటే పది నిమిషాల్లో నిద్ర పట్టేస్తుంది.

ఆర్థికవేత్తలు ఏవేవో లెక్కలు వేసి జీ.ఎన్.పి., జీ.డీ..పీ. అంటూ ఏవేవో లెక్కలు చెప్తారు.

కానీ నా లెక్క ఇది..

ఒక రూపాయి, దాని కొనుగోలు విలువ గమనిస్తే మీకు భారతదేశ ఆర్థిక పరిస్థితి వెంటనే అర్థమైపోతుంది. ఈ కొనుగోలు విలువ కాలక్రమంలో తగ్గుతూ వస్తోంది.

పూర్వం ఓ రూపాయి ఓ వారం వరకూ వచ్చేది. ఇప్పుడు....?

ఆలోచించి చూడండి..

తమిళంలో ఇదంతా రాసిన వ్యక్తి సుజాత అనే ప్రముఖ రచయిత. ఆయన అసలు పేరు ఎస్.రంగరాజన్. ఆయన తన భార్య పేరుతో రాస్తుండేవారు. ఆయన ఓ సైంటిస్ట్. ఆయన వందకు పైగా నవలలు, 250 కథలు, అనేక వ్యాసాలు రాశారు. సైన్సుకి సంబంధించి పది పుస్తకాలు రాశారు. ఆయన పది నాటకాలతో పాటు అనేక కవితలు రాశారు. 1935లో జన్మించిన ఆయన 2008లో కన్ను మూసారు.

కొన్ని సంవత్సరాల క్రితం ఆయన కుముదం అనే తమిళ వారపత్రికకు కొన్ని వారాల పాటు ఓ ప్రత్యేక కాలమ్ రాశారు. అందులో ఒకటి ఈ డబ్బు డబ్బు వ్యాసం. దానికిది నా స్వేచ్ఛానువాదం. ఈయనంటే భారత మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె.అబ్దుల్ కలాంకి బోలెడంత ఇష్టం.

............

డబ్బు ఎంత పనైనా చేస్తుంది.

ఈ ప్రపంచంలో డబ్బే ముఖ్యమని అనుకునేవారే ఎక్కువ శాతం మంది. డబ్బు కోసం ఏం చేయడానికైనా నడుం బిగించేస్తారు.

పెద్దవాళ్లు ఏమనుకుంటున్నారో తెలుసా..

డబ్బుతో ఈ శాస్త్రీయ ప్రపంచంలో ఎన్నింటినైనా అనుభవించవచ్చని అనుకుంటూ ఉంటాం. కానీ ఇది నిలకడ లేని నకిలీ జీవితం.

డబ్బు కన్నా డబ్బుని సంపాదించడం కన్నా ముఖ్యమైన శక్తి మరొకటి ఉంది. అది మన దగ్గరే ఉంది. కానీ దానిని తెలుసుకోం. డబ్బుతో పొందలేని ఆనందాన్ని, ప్రశాంతతను, నిలకడైన జీవితాన్ని ఇచ్చే ఆ శక్తి ఏమిటి? అది మరేమీ కాదండీ, పరోపకారాన్ని పెంచే దైవ నమ్మకం. నిజం చెప్పాలంటే ఇదే అసలైన సంపద. కానీ దీనిని మనం మరచిపోతాం అని పెద్దలు, అనుభవజ్ఞులు చెప్తుంటారు. అయినప్పటికీ మాటలను మనం వింటామా అనేది ప్రశ్నార్థకమే!

**డబ్బుతో ఈ శాస్త్రీయ ప్రపంచంలో ఎన్నింటినైనా అనుభవించవచ్చని అనుకుంటూ ఉంటాం. కానీ ఇది నిలకడ లేని నకిలీ జీవితం.**

చర్చిల్ ఓసారి బీబీసీలో ప్రసంగించడానికి పోతున్నారు. అప్పుడు ఒక టాక్సీ ఎక్కారు రేడియో స్టేషన్ చేరుకోవడానికి. అయితే టాక్సీ డ్రైవర్ అప్పటివరకూ చర్చిల్‌ని ప్రత్యక్షంగా చూళ్లేదు. కనుక తన టాక్సీలో ఎక్కింది చర్చిల్ అన్న విషయం డ్రైవర్‌కి తెలీదు.

టాక్సీ రేడియో స్టేషన్ దగ్గర ఆగింది. చర్చిల్ కిందకు దిగారు. టాక్సీ డ్రైవరుతో "ఇదిగో చూడు మిస్టర్! ఓ అరగంటసేపు ఇక్కడ ఆగుతావా?" అని అడిగారు చర్చిల్.

"అదంతా కుదరదు. నాకో ముఖ్యమైన పని ఉంది" అన్నాడు టాక్సీ డ్రైవర్.

"ఏమిటి? అంత ముఖ్యమైన పని?" అని అడిగారు చర్చిల్.

టాక్సీ డ్రైవర్ "చర్చిల్‌గారు రేడియోలో ప్రసంగించబోతున్నారు. ఎక్కడికైనా వెళ్లి ఆ ప్రసంగం వినాలి" అన్నాడు.

చర్చిల్ అతని వంక చూశారు. పర్సులోంచి కొంచెం డబ్బు తీశారు చర్చిల్.



"ఇదిగో.. ఈ పది షిల్లింగులు ఉంచుకో. కాస్త నా కోసం ఆగు" అని అన్నారు చర్చిల్.

"అలాగైతే సరే సార్. ఆ చర్చిల్ మాట్లాడితే నాకేంటి? మాట్లాడకుంటే నాకేమిటి? ఆయనేం చెప్తే నాకేమవసరం" అంటూ టాక్సీ డ్రైవర్ చర్చిల్ నుంచి డబ్బులు తీసుకుని జేబులో వేసుకున్నాడు.

డబ్బుకి ఎంత ప్రాధాన్యం ఉందో చూసారుగా!

.........

అదొక స్విమ్మింగ్ పూల్. అందులో మాసుకోకుండా ఒక వ్యక్తి దిగిపోయాడు. ఆయనకు ఈత రాదు. నీటిలో కొట్టుకుంటున్నారు. ఇంకొకరు అది చూశారు. ఆ చూసినతనికి ఈత వచ్చు. అప్పటికప్పుడు స్విమ్మింగ్ పూల్‌లోకి దూకాడు. ఈత రాకుండా ఇబ్బంది పడుతున్న వ్యక్తిని కాపాడి ఒడ్డుకు చేర్చాడు.

"నన్ను కాపాడాలనే ఆలోచన మీకు ఎలా వచ్చింది?" అని అడిగారు ఈత రాని వ్యక్తి.

"అదిగో అక్కడ ఓ ప్రకటన బోర్డు ఉంది చూడండి.. అది చూడడంతోనే మిమ్మల్ని కాపాడాలనే ఆలోచన వచ్చింది" అన్నాడు ఈత తెలిసిన వ్యక్తి.

"ఈత రాకుండా కొలనులో దిగి ఇబ్బంది పడుతున్న వారిని కాపాడిన వారికి వంద రూపాయలు కానుక" అని ఆ ప్రకటన బోర్డులో రాసి ఉండటాన్ని చూడమన్నాడు ఈత వచ్చిన మనిషి.

అప్పుడు కాపాడబడిన మనిషి "నేనైతే కాపాడి ఉండను. ఇంకాస్సేపు నిరీక్షించి వుంటాను" అన్నాడు.

"ఎందుకు?" అని అడిగాడు అతనిని కాపాడిన మనిషి.

"మీరు ఆ ప్రకటన బోర్డు పక్కన రాసి ఉన్న మాటలను చదివినట్టు లేదు. అది చదివి వుంటే మీరు తొందరపడి నన్ను కాపాడి ఉండరు" అన్నాడు సాయం పొందిన వ్యక్తి.

ఈత రాని వ్యక్తిని కాపాడిన వ్యక్తి ప్రకటన బోర్డు వంక చూశారు.

అందులో ఇలా రాసి ఉంది.

"ఈత రాకుండా నీటిలో ఇబ్బంది పడుతున్న వారిని కాపాడిన వారికి వంద రూపాయలు కానుక. అదే చనిపోయిన వారిని తీసుకొచ్చి ఒడ్డున పడేస్తే వారికి రెండు వందల రూపాయలు కానుక" అని.

చూసారా.. డబ్బు ఎంత పని చేస్తుందో!"

# ఏదీ శాశ్వతం కాదు..

కస్తూరి మురళీకృష్ణ

**అది శాస్త్ర జేతవనంలో విహారం చేస్తున్న సమయం.**

**ఆ సమయంలో శ్రావస్తి నగరంలో నివసించే ఒక గృహస్తు సోదరుడు మరణించాడు.**

**తమ్ముడి మరణం అతడిని దుఃఖసాగరంలో ముంచింది. అతడిలో జీవితేచ్ఛ నశించింది.**

**స్నానం మానేశాడు. ఆహార సేవనం వదిలేశాడు. శరీరాలంకరణను విస్మరించాడు. రోజూ పొద్దున్నే లేచి శ్మశానం చేరేవాడు.**

శ్మశానంలో కూర్చొని తమ్ముడిని తలచుకుని ఏడుస్తుండేవాడు.

ఒకరోజు శాస్త్ర బ్రహ్మ ముహూర్తాన లోకాన్ని పరిశీలిస్తున్నప్పుడు ఆయన దృష్టి దుఃఖిస్తున్న గృహస్తుపై పడింది.

అతడు ఎందుకని దుఃఖిస్తున్నాడో పరిశీలించాడు శాస్త్ర.

"ఇతడి దుఃఖం తగ్గించాలి. ఇతడిని శాంతి మార్గంలో ప్రవేశపెట్టాలి" అని అనుకున్నాడు.

మరుసటి రోజు భోజనం అయిన తరువాత ఇతర శ్రమణులతో కలసి ఆ గృహస్తు ఇంటికి వెళ్లాడు శాస్త్ర.

శాస్త్ర వచ్చాడన్న విషయం తెలియగానే గృహస్తు పరుగు పరుగున వచ్చాడు.

శాస్త్రను ఇంటిలోపలకు పిలిచాడు. ఉచితాసనం వేశాడు. తగిన రీతిలో సత్కరించాడు.

ఆయనకు ప్రణామం చేసి ఒక పక్కన కూర్చున్నాడు.

అతడిని చూసి మందహాసం చేస్తూ అడిగాడు శాస్త్ర "ఎందుకని విచారంగా ఉన్నావు? నీ దుఃఖానికి కారణం ఏమిటి?"

దానికి విషాదంగా సమాధానం ఇచ్చాడు అతడు.

"నా సోదరుడు హఠాత్తుగా మరణించాడు. అప్పటి నుంచి నాకు అన్నిటిపై ఆసక్తి పోయింది. దుఃఖం నన్ను ముంచెత్తుతోంది".

"అన్ని బాధలు, వేదనలు అశాశ్వతం. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. శాశ్వతం కానిదాని గురించి శోకించి లాభం లేదు. పురాణ పండితులీ విషయం గ్రహించి విచారం వదిలిపెట్టారు" అన్నాడు.

అది విన్న గృహస్థులో ఆ గాథ తెలుసుకోవాలని కుతూహలం జనించింది.

పురాణ పండితుల గాథ చెప్పమని శాస్త్ర అభ్యర్థించాడు.

అతడి అభ్యర్థనను మన్నించి పురాణ పండితుడి పూర్వ గాథను చెప్పటం ఆరంభించాడు శాస్త్ర.

............

వారణాసిలో బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలం అది.

ఆ సమయంలో ఎనభై కోట్ల ధనం గల ఐశ్వర్యవంతుడైన శ్రేష్ఠి ఇంట్లో పుట్టాడు బోధిసత్త్వుడు.



బోధిసత్త్వుడు పెద్దవాడయ్యే సమయానికి అతని తల్లిదండ్రులు మరణించారు. కుటుంబ ఆస్తిని అతని సోదరుడు సంరక్షిస్తుండేవాడు. దాంతో సోదరుడిపై ఆధారపడి జీవించేవాడు బోధిసత్త్వుడు.

ఇంతలో అతని సోదరుడికి వ్యాధి వచ్చింది.

ఆరంభంలో మామూలు వ్యాధి అనుకున్నారు. కానీ, రాను రాను వ్యాధి తీవ్రతరమయింది. ఎన్ని రకాల వైద్యం జరిపించినా ఫలితం లేకుండా పోయింది. చివరికి ఒకరోజు అతను మరణించాడు.

స్నేహితులు, బంధువులు అంతా గుమిగూడారు. పెద్దగా రోదించటం ఆరంభించారు. చేతులు, కాళ్ల కొట్టుకుంటూ తలలను బాదుకుంటూ ఏడ్చారు. ఒకరి మీద ఒకరు పడి పొర్లుతూ ఏడ్చారు. ఒక్కరు కూడా వివేకంతో సంయమనం పాటించలేదు.

అందరూ పడీ పడీ ఏడుస్తున్న సమయంలో ఏడవకుండా ఉన్నది బోధిసత్త్వుడు ఒక్కడే.

అతడు అందరిలా పడి ఏడవలేదు. కన్నీళ్ల కడవలకొద్దీ కార్చలేదు. అరిచి గీ పెట్టలేదు. కంట ఒక్క చుక్క నీరు కూడా లేదు.

ఇది అందరికీ ఆగ్రహం కలిగించింది.

"చూడండి.. ఇతడికి సోదరుడి పైన ప్రేమ లేదు. సోదరుడు హఠాత్తుగా మరణించాడు. అందరూ ఎలా కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారో చూడండి. కానీ ఇతను మాత్రం ఏడవటం లేదు. ముఖంపైన విషాదం ఈషణ్మాత్రం కూడా లేదు. ఇతడికి బాధ లేదు. చాలా కఠిన హృదయుడు. చూస్తుంటే సోదరుడి మరణానికి చాలా సంతోషిస్తున్నట్టున్నాడు. ఇంతకు ముందు ఆస్తిని సోదరుడితో పంచుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు సోదరుడు మరణించాడు కాబట్టి, అంతా తానే అనుభవించవచ్చని సంతోషిస్తున్నట్టున్నాడు. ఎంత క్రూరుడు.. ధూర్తుడు" అని అతన్ని నిందించటం ఆరంభించారు.

మిత్రులు, బంధువులు, ఇరుగు, పొరుగు అతడిని దూషించారు.

వారేమన్నా బోధిసత్త్వుడు ఎలాంటి ఆగ్రహం ప్రదర్శించలేదు.

అందరూ తిట్టీ తిట్టీ అలసిపోయిన తరువాత మెల్లిగా, శాంతంగా చెప్పటం ఆరంభించాడు.

"మీరు కూడా చనిపోతారు. మన తరువాత వచ్చినవారు కూడా చనిపోతారు. అందరం చనిపోవాల్సిన వాళ్లమే.

ఇందులో పోయినవారెవరూ "అయ్యో! నేను చనిపోయానే" అని ఏడ్వరు. ఎందుకంటే అన్ని సంస్కారాలు అనిత్యాలే. ఇక్కడ ఏదీ శాశ్వతం కాదు. అన్నీ అశాశ్వతాలే. మీకీ అష్టలోక ధర్మాలు తెలియవు. కాబట్టి మీరు ఏడుస్తున్నారు. నాకు అష్టలోక ధర్మాలు తెలుసు. అందుకని నేను దుఃఖించను. అశాశ్వతానికి దుఃఖించటంలో అర్థం లేదు. చనిపోయినవారి కోసం ఏడ్చేవారు కూడా ఏదో ఒకరోజు చనిపోతారు. ప్రతిఒక్కరూ కాలధర్మం చెందక తప్పదు. పక్షులు, జంతువులు, నాగులు, నదులు, దేవతలు ఎవరికీ తమ శరీరాలపై ఎలాంటి అధికారం లేదు. ఎన్ని భోగభాగ్యాలు అనుభవించినా, ఎన్ని కష్టనష్టాలు ఎదుర్కొన్నా ఏదో ఒకనాడు దేహాన్ని త్యజించక తప్పదు.

ఈ ప్రపంచంలో సుఖం, దుఃఖం రెండూ చంచలమే. ఏదీ శాశ్వతం కాదు. కాబట్టి ఎంత ఏడ్చి మొత్తుకున్నా ఏమీ లాభం వుండదు. నీచులు, మద్యపానమత్తులు, ధూర్తులు, ఏమీ చేతకానివారు, అజ్ఞానులు, దుండగులను ధీరులు, మూర్ఖత్వంచేత, విజ్ఞానంతో ఉన్నవారికి మూర్ఖులుగా భావిస్తాను" అన్నాడు బోధిసత్త్వుడు అక్కడున్న వారితో.

............

ఇదంతా అందరికీ వివరించాడు శాస్త.

కథ పూర్తయిన తరువాత చెప్పాడు.

"ఆ కాలంలో వారందరికీ ధర్మబోధ చేసి, వారి శోకాన్ని తొలగించిన వాడిని నేనే".

............

అది శాస్త జేత వనంతో విహరిస్తున్న రోజులు.

ఆ రోజులలో ఒక భిక్షువు తన భార్యపై ఆకర్షణ గురించి సంభాషిస్తుండగా అది శాస్త విన్నాడు.

"ఓయి భిక్షూ! నీ పూర్వ భార్య ఆకర్షణ వల్ల పూర్వజన్మలో నీ శిరస్సు ఖండితమయింది" అన్నాడు.

ఆ కథ వినాలని అక్కడున్న వారందరికీ కుతూహలం కలిగింది. ఆ గాథ చెప్పమని వారు శాస్తను అభ్యర్థించారు.

వారి అభ్యర్థనను మన్నించి శాస్త పూర్వ గాథ చెప్పటం ప్రారంభించాడు.

............

అది వారణాసిలో బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలం.

ఆ కాలంలో బోధిసత్త్వుడు కాశీలో ఓ ఇంట్లో చోర నక్షత్రంలో పుట్టాడు.

దాంతో ఆయన చోరుడయ్యాడు. దొంగతనాలు చేస్తూ జీవితం గడపసాగాడు.

అతడు నాగబలుడనీ, అతడిని



బంధించటం ఎవ్వరితనం కాదనీ ప్రజలు నమ్మటం ప్రారంభించారు.

అతడు ఎవరి ఇంట్లోనయినా దొంగతనం చేస్తే, వారు ఫిర్యాదు చేసేందుకు కూడా భయపడేవారు.

ఒకరోజు అతడు ఒక శ్రేష్ఠి ఇంటికి కన్నం వేశాడు, బోలెడంత ధనాన్ని అపహరించాడు.

ఎందరు వారిస్తున్నా వినకుండా ఆ శ్రేష్ఠి రాజుకు ఫిర్యాదు చేశాడు.

"గొప్ప దొంగ నగరంలో తిరుగుతున్నాడు. ఇష్టం వచ్చినట్టు దొంగతనాలు చేస్తున్నాడు. వాడికి ఏవో శక్తులున్నాయని అందరూ భయపడుతున్నారు. వాడిని మీరు బంధించి, శిక్షించకపోతే మీ శక్తిని అనుమానించాల్సి వస్తుంది" అన్నాడు.

రాజుకు కోపం వచ్చింది.

వెంటనే రక్షకభట అధికారిని పిలిచాడు.

"ఆ దొంగ ఎవడో వాడిని పట్టుకుని నా ముందుకు తీసుకురండి" అని ఆజ్ఞాపించాడు.

రాజు ఆగ్రహాన్ని గ్రహించిన ఆ అధికారి ఎట్టి పరిస్థితులలో దొంగని పట్టుకోవాలని నిశ్చయించాడు.

ఇల్లును ఏర్పాటు చేసి రాత్రంతా వారు నగరమంతా తిరుగుతుండేట్లు, దొంగ కనిపిస్తే పట్టుకునేట్టు ఏర్పాట్లు చేశాడు.

ఒకరోజు ఆ దొంగ దొరికాడు.

"వాడి తల నరకండి" ఆజ్ఞాపించాడు రాజు.

దొంగ రెండు చేతులు వెనక్కి విరిచి కట్టేశారు. ఎర్రగన్నేరు పూలదండ మెడలో వేశారు. తల మీద ఇటుక పొడి చల్లారు. వాడిని కొరడాతో వధ్యశాలకు తీసుకుపోసాగారు.

దొంగ దొరికాడన్న వార్త నగరమంతా పాకిపోయింది.

ఆ రోజులలో వారణాసిలో 'శ్యామ' అన్న వేశ్య ఉండేది.

ఆమె రోజుకు వెయ్యికి పైన ధనం స్వీకరించేది. రాజుకు అతిప్రియమైన వేశ్య ఆమె. ఆమెకు అయిదు వందల సంఖ్యలో దాసీలు ఉండేవారు.

ఆ రోజు ఆమె మేడ కిటికీ తెరచి వీధిలోకి చూస్తోంది. కింద అదే సమయానికి రాజభటులు దొంగను వధ్యశిల వద్దకు తీసుకుపోతున్నారు.

అందమైనవాడు అయిన చోరుడు ఆమె కంట పడ్డాడు.

అతడిని చూడగానే ఆమె మనసు పారేసుకుంది.

"ఇతడిని రక్షించి నా వాడిగా ఎలా చేసుకోవాలా?" అని ఆలోచించింది.

భటులు అతడిని తీసుకుపోతున్న విధానం చూస్తే వారికి అతడి మీద ఎంతో కోపం ఉన్నట్టు, రాజుకి అతనిపై ఉన్న కోపం భటులు ప్రదర్శిస్తున్నట్టు ఆమెకు అర్థం అయింది. అంతలో ఆమెకు ఒక ఆలోచన వచ్చింది. వెంటనే సేవకురాలిని పిలిచింది.

(ఇంకా ఉంది..)

పర్వతాల శ్రీనివాస లక్ష్మీనరసింహ్మన్

# వెలుగురేఖల దీపావళి



**దీపం జ్యోతిః పరం బ్రహ్మ దీపం సర్వ తమోపహమ్ ।**
**దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీప నమోస్తుతే ॥**
**శుభం రోతు కళ్యాణం ఆరోగ్యం సుఖ సంపదమ్ ।**
**శతృ బుద్ధి వినాశం చ దీప జ్యతిర్నమోస్తుతే ॥**

భారతీయ సనాతన సంప్రదాయంలో పండుగలకు ఒక గొప్ప ప్రత్యేకత ఉంది. ఒక్కో మాసంలో కాలాన్ని, రుతువులను బట్టి పండుగలు వస్తాయి. ఈ పండుగలు భారతీయుల ఈవన విధి విధానాలను తెలియజేస్తాయి. ఇంకా కొన్ని పండుగలయితే ప్రాంతాలు, కులమతాలతో ఎటువంటి సంబంధం లేకుండా ఉన్నవారు, లేనివారు అనేటటువంటి భేదభావాలు, తారతమ్యాలు లేకుండా అంతా కలిసి మెలిసి పండుగ సంబరాలను అంబరాన్నంటే విధంగా చేసుకుంటారు. అలాంటి పండుగల్లో ఒకటి ప్రధానమయిన పండుగ 'దీపావళి'.

దీపావళి పండుగ ఆశ్వయుజ మాసంలో అమావాస్యనాడు జరుపుకుంటారు. అమావాస్యరోజు పూర్తిగా చిమ్మచీకట్లు కమ్ముకుంటాయి. కానీ దీపాల వెలుగుల్లో, కాంతుల్లో, టపాసులు (టపాకాయలు) మోతలతో ఆకాశమంతా మిరుమిట్లు గొలుపుతూ రంగు రంగుల వెలుగులతో నిండిపోతుంది. దీపాళికి ముందురోజు నరక చతుర్దశి వస్తుంది. నరకచతుర్దశినాడుగానీ, దీపావళినాడుగానీ స్వాతి నక్షత్రం వచ్చినట్లయితే చాలా శుభప్రదం. తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో కేదారేశ్వర వ్రతాలు నోముకుంటారు. అలా కొత్తగా నోములు ప్రారంభించేవారికి స్వాతి క్షత్రం చాలా మంచిది. దీపావళికి, పితృదేవతలకు అవినాభావ సంబంధం ఉందని పెద్దలు చెప్తుంటారు.

మహాలయ పక్షంలో పితృదేవతలు పితృలోకం నుండి భూమి మీదకు దిగివస్తారని నమ్మకం. మహాలయ పక్షంలో పితృదేవతలకు శ్రాద్ధ తర్పణాలు ఇస్తారు. ఈ విధంగా తర్పణాలు స్వీకరించిన పితృదేవతలు ఆశ్వయుజ అమావాస్య రోజున తిరిగి ప్రయాణమవుతారు. ఈ దీపాల వెలుగులు వారికి మార్గాన్ని చూపుతాయని ఒక ప్రతీతి.

ఇక ఆరోగ్య విషయానికి వచ్చినట్లయితే స్వాతీ నక్షత్రంతో కూడినటువంటి చంద్రోదయం సమయంలో అభ్యంగన స్నానం చేయడం వల్ల సమస్త కంటిజబ్బులు, తలకు సంబంధించిన వ్యాధులు నశిస్తాయి. పిల్లల్లో కండ్లకలకను రాకుండా చూస్తుంది. గుజరాతీలు, ఉత్తర దేశీయులు దీపావళి పండుగని నూతన సంవత్సరంగా భావించి వారి వ్యాపార సముదాయాల్లోని ఖాతా పుస్తకాలకు పూజలు నిర్వహిస్తారు. దీనిని 'వాహిపూజ' అంటారు. నరకాసురుని వధకు సంతోషించి ప్రజలందరూ పెద్ద ఎత్తున బాణాసంచా కాలుస్తారు. దీపావళి పండుగను ప్రాంతాన్ని బట్టి వారి వారి ప్రాచీన ఆచారాల ప్రకారం నిర్వహించుకుంటారు.

దీపావళినాడు తెలుగు రాష్ట్రాల్లోను ఇళ్లల్లో, వ్యాపార సంస్థల్లో లక్ష్మీపూజను ఘనంగా జరుపుకుంటారు. మట్టి ప్రమిదల్లో నూనె దీపాలు వెలిగిస్తారు. గృహాలను, కార్యాలయాలను విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా అలంకరిస్తారు.

దేవాలయాలు, మఠాలు, గోశాలల్లో దీపాలు వెలిగిస్తారు.

మహారాష్ట్రలో దీపావళి పండుగను అయిదు రోజుల పండుగగా జరుపుకుంటారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారు. పురాణాల ప్రకారం చూసినట్లయితే శ్రీరాముడు రావణాసురుని సంహరించి సతీసమేతంగా అయోధ్యా నగరానికి తిరిగివచ్చిన సందర్భంగా ప్రజలంతా దీపాలు వెలిగించి విజయోత్సవం జరుపుకుంటారు. నరకాసురుడనే రాక్షసుడిని శ్రీకృష్ణుని భార్య సత్యభామ సంహరించిన రోజని పురాణాల కథనం.

## ధనలక్ష్మీ పూజ

మార్వాడీలు ఇంట్లోగానీ, వారి వ్యాపార సముదాయాల్లోగానీ దీపావళి రోజున ఇంటి మధ్య భాగంలో/హాలు మధ్య భాగంలో/వారు వ్యాపారాలు నిర్వహించే ప్రాంతంలోగానీ పిండిముగ్గుతో అష్టదళ పద్మం వేసి పసుపు, కుంకుమలతో ఆ అష్టదళ పద్మాన్ని చక్కగా అలంకరించి మధ్యలో వెండిపళ్లెంలో/రాగిపళ్లెంలోగానీ లక్ష్మీ అమ్మవారి విగ్రహాన్ని లేదా ఫొటోనుగానీ ఉంచి మల్లెపూలతో అలంకరిస్తారు. నైవేద్యంగా పొంగలిని సమర్పిస్తారు. అమ్మవారి ముందు ఒక వెండి లేదా రాగి పళ్లెంలో రూపాయి నాణేలు (వీలయితే పాత రాగినాణేలు), లక్ష్మీగవ్వలను రెండు వేర్వేరు పాత్రల్లో ఉంచుతారు.



## కేదారేశ్వర వ్రతము

కేదారం అంటే వరిపంట పండే మాగాణమని అర్థం. కేదారేశ్వరుడు ప్రధానంగా ప్రధాన ఆహార ధాన్యమైన వరికి అధిపతి. అంటే మనకు అవసరమైన జవసత్వాలనిచ్చి, తద్వారా సంతానోత్పత్తి ఆరోగ్యకరంగా జరిగి వంశాభివృద్ధి జరిగేలా అనుగ్రహిస్తాడు. కార్తిక మాసంలో చంద్రుడు కృత్తికా నక్షత్రంతో కలిసి వున్న రోజు కార్తిక పౌర్ణమి. కార్తిక మాసపు సోమవారాలలోను కేదారేశ్వర వ్రతం ఆచరించిన వాళ్లకు సిరిసంపదలు, అన్న వస్త్రాలకు లోటు లేకుండా వుంటుందని భక్తుల నమ్మకం.

ఉత్తర భారతంలో గోధుమలు ప్రధాన పంటగా వున్నప్పటికీ, కేదారేశ్వరుని పూజకు వరికంకులను సమర్పించి, అక్కడ లభించే సువాసనాభరితమైన బియ్యంతో తయారు చేసిన పొంగలిని దేవునికి నివేదిస్తారు.

అంటే- శివుడు నేలలోని పోషక ధాతువుల రూపంలో పంటకు పోషణనిచ్చి మనిషికి సహకరిస్తారనే భావంతో భక్తులు అన్ని రకాల కూరగాయలతో శుచిగా వండి సమర్పించుకుంటారు.

దీపావళి రోజున చాలా ప్రాంతాలలో పగలు శుచిగా ఉపవాసముండి, బియ్యంపైన శివపార్వతులను ప్రతిష్ఠించుకుని, 21 పత్రులు, పసుపు కొమ్ములు, ఎండుఖర్జూరాలు, బియ్యంతో చేసిన ఫలహారాలతో పాటు, 21 ముడులున్న తోరాన్ని తయారు చేసి వ్రతమాచరించడం అనాదిగా వస్తున్న ఆచారం. వ్రతంలో 21వ సంఖ్యకు ప్రాముఖ్యత ఎందుకంటే శిశువు పుట్టినప్పుడు ఏక వింశతి(21) దోషాలుంటాయి. కేదారుని పూజించడం వల్ల ఈ దోషాలు నశిస్తాయి. మనం సమర్పించే నైవేద్య వస్తువులలో 21 దోషాలకు ఒక్కొక్కటి చొప్పున సమర్పణ చేస్తున్నాం.

ఈ వ్రతాన్ని తొలుత.. హిమవంతుని పుత్రికగా జన్మించిన పార్వతీమాత నియమ నిష్ఠలతో ఆచరించి ఆ పరమశివుని తనువులో సగభాగం పొందిందని పురాణ కథనం.

సూర్యుడు అగ్ని స్వరూపంలో శివుని మూడో కన్నులో కాలాగ్ని రూపంలో దాగి వున్నాడు. పాలు-పెరుగుతో శుక్రుని, తేనెతో గురువును, నెయ్యితో శనీశ్వరుని, కూరలతో చంద్రుణ్ణి, ఫలాలతో బుధుని, బ్రాహ్మణుల ఉపచారంతో కుజుని సేవించిన ఫలం ఈ వ్రతాన్ని చేయడం వల్ల లభిస్తుంది. అంటే కేదారేశుని పూజించడం వల్ల పరోక్షంగా మొత్తం నవగ్రహాలను పూజించిన ఫలం దక్కుతుంది.

కనుక ఆ ఆదిదంపతులవలె భార్యాభర్తలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సంతానవంతులై చిరకాలం వర్ధిల్లటానికి ఈ వ్రతాన్ని దంపతులుగా కూర్చుని ఆచరించటం ముఖ్యం. ఈ వ్రతమాచరించి సకల జనులకూ, కేదారేశ్వరుని అనుగ్రహాశీర్వాదాలు ప్రాప్తించాలని కోరుకుందాం.

**- డేగల అనితాసూరి**

---

అంతేకాకుండా వారి వద్ద అప్పటివరకు ఉన్నటువంటి నగదును కూడా లక్ష్మీదేవి ముందు పెడతారు.



లక్ష్మీగవ్వలను, నాణేలను దోసిలిలోకి తీసుకొని కొద్దిసేపు గలగలలాడిస్తారు. అలా ఆడించినపుడు ఆ సవ్వడికి అమ్మావారు వచ్చి, వారి వారి ఇళ్లలో ఆసీనురాలవుతుందనే నమ్మకం. ఈ విధంగా మార్వాడీలు ప్రతీ అమావాస్య రోజున కూడా వారి ఇళ్లు, దుకాణ సముదాయాల్లో పూజిస్తుంటారు.

అయితే ఇది ఇప్పుడిప్పుడే అన్ని రాష్ట్రాల్లోనూ అలవాటుగా, ఆచారంగా జరుపుకుంటున్నారు. లక్ష్మీపూజకు ఎలాంటి ఆనవాయితీ అక్కర్లేదని చెప్పవచ్చు. ఎందుకంటే ఏ ఇల్లయినా లక్ష్మీదేవి కటాక్షంతో కళకళలాడాలని అందరికీ ఉంటుంది. కాబట్టి అన్ని ప్రాంతాలవారు శక్తిమేరకు లక్ష్మీపూజలు చేసుకుంటున్నారు. దీపావళిని ఒక్కరోజు మాత్రమే అని కాకుండా నరక చతుర్దశి, ధన్‌తేరస్, చోటీ దీపావళి, భాయ్‌దూజ్ అని రోజుకో పేరుతో జరుపుకుంటారు.

మహారాష్ట్రులు జరుపుకునే పండుగలలో ఇది మిక్కిలి ప్రసిద్ధి గాంచింది. వ్యాపారులు ఈరోజు సాయంకాలం జమాఖర్చులు చూసుకొని, కొత్త సంవత్సరానికి చిట్టా పుస్తకాలు పెట్టుకుంటారు.



అట్టి ఖాతా పుస్తకాలను లక్ష్మీపూజలో ఉంచుతారు. వారి దగ్గర పనిచేసే ఉద్యోగులకు, పనివాళ్లకు, సేవకులకు బహుమతులిస్తారు. బంధువులను, మిత్రులను, శ్రేయోభిలాషులను తమ ఇండ్లకు ఆహ్వానించి వారికి తీపి పదార్థాలు పంచుతారు. మట్టి ప్రమిదల్లో వెలిగించిన దీపాలు మాత్రమే కాకుండా, గృహాలను విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. టపాసులు, చిచ్చుబుడ్లు, మతాబులు విపరీతంగా కాలుస్తారు. ఆ టపాసుల శబ్దంతో, చిచ్చుబుడ్ల వెలుగులలో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయే వెలుగునిస్తుంది.

వీలయినంతవరకు ఇంటి నిండా, దుకాణాల ముందు మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగిస్తారు. దీపావళికి వారం రోజుల ముందే ఇండ్లు, దుకాణాలు శుభ్రం చేసుకోవడం, రంగులు వేసుకోవడం చేస్తారు. మార్వాడీలు చేసేటటువంటి ధనలక్ష్మీ పూజలో ఎక్కువగా బుక్కాగులాలు, పేలాలు, గోమతిచక్రాలు ఉపయోగిస్తారు.

పూజ చేసిన తరువాత మరుసటి రోజు ఉదయం చూసినట్లయితే ఆ స్థలం ఎంతో శుచి, శుభ్రతతో ప్రశాంతంగా ఉంటుంది. వీళ్లు ఇంకో విధంగా కూడా చేస్తారు. ఒక తెల్లని వస్త్రాన్ని పసుపులో ముంచి ఆరవేసి, అది ఆరిన తరువాత దానిమీద కుంకుమతో ఓంకారం, స్వస్తిక్, శ్రీకారం అని రాసి ఆ వస్త్రంలో 27, 54, 108 లక్ష్మీగవ్వలను బోర్లిస్తారు. అట్టి లక్ష్మీగవ్వలు కలిగిన వస్త్రాన్ని అమ్మవారి ముందు ఉంచి పూజిస్తారు.

## వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికిందరాబాద్
సెల్: 9885446501/9885449458




# విజయవంతమైన పనికోసం?

**కె.ఆదిత్య, సూర్యాపేట**


**ప్రశ్న: మనం ఏదైనా బిజినెస్ కుదుర్చుకోడానికి వెళ్తున్నప్పుడు లేదా ఏదన్నా ఇంటర్వ్యూకు అటెండ్ అవుతున్నప్పుడు ఆ జాబ్ మనకి రావాలి అని చాలా ట్రై చేస్తున్నప్పుడు.. ఆ పనులు విజయవంతం అవడానికి మనం చేయవలసిన తంత్రాలు, ప్రక్రియలు ఏమైనా ఉంటాయా?**

**జవాబు:** అట్లాంటి ముఖ్యమైన రోజులు ఎన్నో ఉంటాయి. ఉదాహరణకి ఒక బిజినెస్ డీల్ కోసమో లేకపోతే ఒక ఇంటర్వ్యూ కోసమో లేదా ఒక ముఖ్యమైన పని మీద బయటకు వెళ్తున్నప్పుడు, ఆ పని మనకు 'అనుకూలంగా ఫలితం ఇవ్వాలి' అని అనుకుంటే ఎన్నో రకాల స్పిరిచువల్ అనుకోండి లేకపోతే తాంత్రికంగా అనుకోండి.. చెయ్యదగిన పనులు ఉంటాయి.

మనం బయటికి వెళ్తున్నప్పుడు ఎదురయ్యే కొన్ని శకునాలు ఉంటాయి. వాటిని ఎట్లా నమ్ముతామో వీటిని అట్లాగే నమ్మాలి. నమ్మకం ఉండటం, ఉండకపోవటం ఒక్కొక్కరి వ్యక్తిగతమైన విషయం.

ఒకరి జన్మ నక్షత్రరీత్యాగానీ, వ్యవహార నామ నక్షత్ర రీత్యాగానీ వారు కొన్ని నియమాలు పాటించినట్లయితే తప్పకుండా అనుకూల ఫలితాలు ఉంటాయి. అవే కాకుండా వారాలను బట్టి కూడా అనుసరించవలసిన నియమాలు ఉంటాయి.

వారానికి ఏడు రోజులు ఉన్నాయి. సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శని, ఆదివారాలు. "ముఖ్యమైన పనిని ఏ రోజున పెట్టుకున్నారు" అన్నది ముఖ్యమైన విషయం. ఉద్యోగానికి సంబంధించిన ఇంటర్వ్యూలు కావచ్చు, ఒక వ్యాపార పరమైనటువంటి వ్యవహారం కావచ్చు, ఇంకేదైనా ముఖ్యమైన పని కావచ్చు. ఆ రోజును బట్టి



వాళ్ల ఇంట్లో నుండి బయలు దేరేటప్పుడు పాటించవలసిన చిన్న చిన్న జాగ్రత్తలు, నియమాలు మంచి ఫలితాలు రావడానికి దోహదపడతాయి. అలాంటి వాటిలో కొన్ని:

**సోమవారం:** సోమవారంనాడు మీరు ఒక ముఖ్యమైన పని మీద వెళ్తున్నారను కోండి. సోమవారం చంద్రుడికి సంబంధించింది. చంద్రుడికి సంబంధించిన అనుకూల వర్ణాలు తెలుపు, పసుపు. ఈ రెండు రంగులు కూడా చంద్రునికి ప్రసన్నతను కలగచేస్తాయి. మీరు ఆరోజు బయటికి వెళ్లేటప్పుడు ఏదైనా ఆ వర్ణం కలిగినటువంటి అంటే- ఆ రంగులో ఉన్నటువంటి ఒక తీపి పదార్థం తిని బయలుదేరండి. మీకు చక్కటి ఫలితాలు ఉంటాయి.

ఆరోజు మీ వస్త్రధారణ కూడా దానికి అనుకూలంగా ఉండాలి. అంటే మీ వస్త్రధారణలో తెలుపు/పసుపు రంగులు ఉండాలి. ఈ రెండు రంగుల కాంబినేషన్ ఉండకూడదు. ఏదో ఒక రంగు వస్త్రధారణ మాత్రమే ఉండాలి. కనీసం షర్ట్ తెలుపు/పసుపు రంగు ఉండాలి. వెళ్లేముందు తెలుపు లేదా పసుపురంగు స్వీట్ కానీ పండు కానీ(అరటిపండు, పాలు, వెన్న) దీన్ని తిని బయలుదేరితే సరిపోతుంది. ఇలాగే మిగతా వారాలన్నిటికీ కూడా ఉన్న కొన్ని నియమాలను పాటిస్తే మంచి ఫలితాలు ఆశించవచ్చు.

**మంగళవారం:** మంగళవారంనాడు మీరు ముఖ్యమైన పని మీద వెళ్తున్నారనుకోండి.. మంగళవారం కుజుడికి సంబంధించినది. కుజుడికి అనుకూలమైనది ఎరుపు రంగు. పని మీద వెళ్లే ముందు కొంత దానిమ్మ పండు తిని వెళ్లండి. ఎరుపు రంగు వస్త్రధారణ చేయండి. అలాగని మొత్తం కింది నుండి పైకి ఎరుపు రంగు ధరించే అవసరం లేదు. షర్టు ఎరుపు రంగులో ఉన్నా సరిపోతుంది. అలా కుదరనప్పుడు కనీసం ఎరుపు రంగు కాంబినేషన్ కోసం ఒక చేతిరుమాలు లాంటిది వెంటబెట్టుకోండి. అవన్నీ కుదరనప్పుడు కనీసం ఎరుపు రంగు పెన్ను జేబులో పెట్టుకోండి. దీనివల్ల మీరు వెళ్లే పనిలో మీకు సక్సెస్ రేట్ పెరుగుతుంది.

బుధవారం బుధుడికి సంబంధించినది. ఆయనకు అనుకూల వర్ణం ఆకుపచ్చ. మీరు ఇంట్లో బయలుదేరే ముందు ఆకుపచ్చని స్వీట్ పదార్థం ఏదైనా తిని బయలుదేరండి. లేదా ఆకుపచ్చ రంగు ఉండే జామకాయ, అరటిపండు తొనొచ్చు. బుధవారం మీకు పనికొచ్చే వస్త్రం వర్ణం ఆకుపచ్చ. మొత్తం యూనిఫామ్‌గా షర్టు, ప్యాంట్ వేసుకోకపోయినా ఆకుపచ్చ రంగులో ఉన్న షర్ట్ వేసుకోండి. అలా కుదరకపోతే ఆకుపచ్చ రంగు కర్చీఫ్/పెన్ను దగ్గర పెట్టుకోండి. విజయావకాశాలు అద్భుతంగా ఉంటాయి.

(మిగతా వచ్చే వారం...)

వాస్తువిద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

### వాస్తువార్త

పూర్తి పేరు..................................................................

పుట్టినతేదీ : ...................... ఊరు : .................

జన్మ నక్షత్రం: ...............తల్లి పేరు: ......................

చిరునామా: .................................................



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. పూజలలో ప్రథమ తాంబూలాన్ని వాడండి. ఆర్థిక ప్రయోజనాలు పొందుతారు. రాజకీయ రంగాల్లోని వారికి మంచి అవకాశాలు లభిస్తాయి. భూముల క్రయ-విక్రయాలలో లాభాలు పొందుతారు. శుభకార్యాలు సానుకూలపడతాయి. రహస్య సమాచారం తెలుసుకుంటారు. బ్యాంకు ఉద్యోగస్తులకు బాగుంటుంది.

## వృషభం



కీలకమని భావించిన విషయాలలో తొందరపాటు తగదు, జాగ్రత్త వహించండి. సెంటిమెంట్ వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు అవసరం. ముఖ్యమైన పనులు సన్నిహితుల సహకారంతో పూర్తి చేస్తారు. ఆలోచనలకు కార్య రూపం ఇస్తారు. నూతన కార్యక్రమాలు చేపడతారు. గృహం, వాహనం అమ్మకాలు-కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

## మిథునం



చేపట్టిన పనులు నిదానంగా పూర్తి అవుతాయి. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. సహోద్యోగులతో అకారణంగా విరోధాలు ఏర్పడవచ్చు. షేర్లు, భూముల క్రయ-విక్రయాల్లో మెలకువ అవసరం. సంఘ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొం టారు. వారాంతంలో అనుకూలమైన మార్పులు గోచరిస్తున్నాయి.

## కర్కాటం



అనుకోని ఖర్చులు వచ్చి పడతాయి. బంధువుల ద్వారా ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు బాగుంటాయి. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో సాంబ్రాణి, త్రిశూల్ పొడితో ధూపం వేయండి. నరదృష్టి తొలగిపోతుంది. ప్రయాణాలలో నూతన పరిచయాలు లభిస్తాయి. భూ వివాదాలు తలెత్తే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉండండి.

## సింహం



నూతన ఉద్యోగ అవకాశాలు కలిసి వస్తాయి. గతాన్ని మర్చిపోలేక ఇబ్బంది పడతారు. కోర్టు వ్యవహారాలు, తీర్పులు అనుకూలంగా వున్నప్పటికీ రావాల్సిన ప్రయోజనాలు ఆలస్యంగా చేతికి వస్తాయి. సౌర కంకణం ధరించండి. ఆరోగ్యం బాగవుతుంది. రుణ బాధల నుండి బయట పడడానికి ఎంతగానో శ్రమిస్తారు. స్వల్ప ధనం లాభం పొందుతారు.

## కన్య



సంగీతం పట్ల ఆసక్తి కనబరుస్తారు. ప్రజాదరణ లభిస్తుంది. మీకంటూ ఒక గుర్తింపు కోసం పరితపిస్తారు. స్త్రీ సంతానం పట్ల మక్కువ కలిగి వుంటారు. వాళ్లకు విలువైన వస్తువులు, వస్త్రాలు కొనిస్తారు. కాలక్షేపం కోసం కాలాన్ని వృథా చేస్తున్నారన్న నిందలు పడతారు. షేర్లు, భూముల క్రయ-విక్రయాల్లో ఆశించిన లాభాలు అందుతాయి.

## తుల



మీరు చేసే పనికి ఎవరూ వంకలు పెట్టలేరు. అంతలా కష్టపడి పని చేస్తారు. ఈ విషయాన్ని కొంతమంది కచ్చితంగా గుర్తిస్తారు. మీకు రావాల్సిన క్రెడిట్, సముచిత స్థానం లభిస్తాయి. వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. నూతన చిన్న వ్యాపారానికి పెట్టుబడుల కోసం ప్రయత్నాలు చేస్తారు. తండ్రి తరపు వారితో చిక్కులు కలుగుతాయి. ఇంట్లో, వ్యాపార ప్రదేశంలో సాంబ్రాణి, త్రిశూల్ పొడితో ధూపం వేయడం మంచిది.

## వృశ్చికం



ధన రూపంలో హామీలు ఇవ్వవద్దు. దూర ప్రాంతాల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. వ్యూహాలు, ప్రతివ్యూహాలు అమలు చేస్తారు. రాజకీయాల్లో ఉన్నవారికి పదవుల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. జిల్లేడు వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం మంచిది. ఆటంకాలన్నీ తొలగిపోతాయి. రాజకీయ పైరవీలు మీకు మేలు చేస్తాయి. కుటుంబ వ్యవహారాల్లో కల్పించుకోవడం మీకు ఏమాత్రం ఇష్టం ఉండదు.

## ధనుస్సు



స్థిర, చరాస్తులకు సంబంధించిన ముఖ్యమైన వ్యవహారాలు, విషయాలు నత్తనడకన సాగుతాయి. అయినవాళ్లతో విభేదాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. కొంతమంది స్నేహితుల ద్వారా ఉపయుక్తమైన సమాచారం అందుకుంటారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం మంచిది. నూతన ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు అనుకూలి స్తాయి. ప్రయాణాల్లో ఆసక్తికరమైన అంశాలు తెలుసుకుంటారు.

## మకరం



సినీ కళాకారులకు అనుకూలం. నూతన అవకా శాలు, ప్రాజెక్టులు అందుకుంటారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో ఉన్నవారికి అనుకూలమైన మార్పులు, హోదాలు ఏర్పడతాయి. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. వాతావరణంలో మార్పుల ప్రభావం వల్ల తొందరగా అనారోగ్య సమస్యలు అవకాశాలున్నాయి. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి.

## కుంభం



ఒకానొక సందర్భంలో ముఖ్యమైన సమాచారం, వస్తువులు ఆలస్యంగా మీకు చేరడం వల్ల నష్టపోయే అవకాశం ఉంది. ఈ పరిస్థితి రాకుండా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఉపయోగం ఉండదు. ఆరోగ్య విషయంలో కచ్చితమైన నియమాలు పాటించడం అత్యవసరం. దూర ప్రాంత ప్రయాణాలు ఉద్దేశపూర్వకంగా వాయిదా సుకుంటారు.


## మీనం




దైవ దర్శనం చేసుకోవాలన్న ఆలోచనలు కలిసి వస్తాయి. కుటుంబ సమేతంగా వెళ్లాలని తేదీలు నిర్ణయించుకుంటారు, తగిన ఏర్పాట్లు చేసుకుంటారు. వృత్తిరీత్యా మంచి మార్పులు ఏర్పడతాయి. చేతికి కుబేర కంకణం ధరించండి. లక్ష్మీ కటాక్షం లభిస్తుంది. మన శత్రువర్గం ఎవరెవరు? అన్న విషయాలు గ్రహిస్తారు. సహోదర, సహోదరి వర్గంతో సమయ స్ఫూర్తితో, వాక్చాతుర్యంతో సమస్యలు తలెత్తకుండా ప్రయత్నిస్తారు.

# ఈ వారం కా'ర్టూన్స్'


షాప్స వాడికి కూడా తెలియదుట.. ఇది తిరుగుతుందా?
పేలుద్దా, పూలు చిమ్ముతుందా.. గాలిలోకి దూసుకు పోతుందా?


..IAS అనుకుంటున్నావా? అక్కడే ఉంటాను.. ఇక్కడే పని చేస్తాను అనడానికి? నోర్మూసుకుని వెళ్ళి రిపోర్టు చెయ్యి!!
హెడ్డాఫీసు


బాంబు
మీలా పదేసి బాంబులు కొనుక్కెళ్ళి కాల్చేంత టైం ఉండదు బాబూ మాకు!







స్టోబ్నికా
క్యాజిల్ అని పిలవబడే ఈ కోట
పోలండ్‌లో ఉంది. కొలను మధ్యలో
వున్న ఈ కోట అక్కడి పర్యాటక
ప్రాంతాల్లో ఒకటి.







